PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 175 | విజయవాడ, మంగళవారం 30 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tuesday 30 January 2024 | Rs

ఇద్దరు అదనపు డిజిలు, ఇద్దరు ఐజిలు సహా.. 30 మంది ఐపిఎస్ అధికారుల బదిలీ

• లోపలి పేజీలో.. •

కులగణన షెడ్యూల్ పొడిగింపు

● ఫిబ్రవరి 20 నాటికి పూర్తి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కులగణన షెడ్యూల్‌ను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల 15 నాటికి మొత్తం సర్వే పూర్తికావాల్సి ఉండగా, దానిని ఫిబ్రవరి 20 వరకూ పొడిగించింది. ఇంటింటి పర్యటన ద్వారా వివరాలు సేకరించేందుకు ఈ నెల 28వ తేదీ వరకు గడువుగా నిర్దేశించగా, దానిని వచ్చే నెల నాలుగో తేదీ వరకు, సర్వేలో అందుబాటులో లేకుండా మిగిలిన వారి కోసం ఫిబ్రవరి రెండో తేదీ వరకు సర్వే గడువును విధించగా, దానిని ఫిబ్రవరి ఏడో తేదీ వరకు పొడిగించారు. ఈ కొత్త గడువును అన్ని శాఖల అధికారులు, జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని ప్రణాళికా శాఖ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

రాజ్యసభ కోసం

వ్యూహ ప్రతివ్యూహాలు

•షెడ్యూల్ విడుదల చేసిన ఇసి •వైసిపి రెబల్స్‌పై స్పీకర్ విచారణ • హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యసభ ఎన్నికల్లో సత్తా చాటడాన్ని వైసిపి, టిడిపిలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అన్ని సీట్లను దక్కించుకోవడానికి వైసిపి, తగినంత సంఖ్యాబలం లేకపోయినా ఒక సీటు కైవసం చేసుకోవడానికి టిడిపి వ్యూహప్రతివ్యూహాలు రూపొందించుకుంటున్నాయి. వైసిపి రెబల్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిల అనర్హత పిటిషన్లపై రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం విచారణ ప్రక్రియను నిర్వహించారు. ఈ విచారణ ప్రక్రియ జరుగుతుండగానే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదలచేసింది. మరోవైపు వైసిపి రెబల్స్ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. వైసిపి ఎంఎల్‌ఎలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి విచారణకు హాజరయ్యారు. విడివిడిగా జరిగిన విచారణలో తమకు మరింత సమయం కావాలని వారు కోరారు. న్యాయనిపుణులతో సంప్రదించేందుకు, వీడియో పేపర్ క్లిప్పింగ్‌ల వాస్తవాల నిర్ధారణకు తమకు సమయం అవసరమని వారు స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. సహజ న్యాయసూత్రాల ప్రకారం తమ వాదనలూ వినాలని, ఆ వాదనలు వినిపించేందుకు మరింత సమయం కావాలని వారు కోరినట్లు తెలిసింది. తాము చేసిన ఈ విజ్ఞప్తిని స్పీకర్ తిరస్కరించినట్లు విచారణ అనంతరం వారు మీడియాకు తెలిపారు.

ఏం చెప్పారు...?

స్పీకర్‌ను కలిసిన అనంతరం వైసిపి రెబల్స్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తాము స్పీకర్ దృష్టికి తీసుకుపోయిన అంశాలను వివరించారు. అనర్హత పిటిషన్లపై వివరణ ఇచ్చేందుకు మరింత సమయం అవసరమని రాతపూర్వకంగా స్పీకర్‌ను గతంలోనే కోరామని, దానికి ఆయన స్పందించకపోవడంతో ఇప్పుడు ప్రత్యక్షంగా కలిసినట్లు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, ఆ మేరకు వైద్యులిచ్చిన నివేదికను సమర్పించినా స్పీకర్ పట్టించుకోవడం లేదని అన్నారు. తాను విప్ ఉల్లంఘించాననడానికి ఆధారలేమిటో బయటపెట్టాలని కోరినట్లు మిగతా 2లో



8న నోటిఫికేషన్, 27న పోలింగు

రాజ్యసభలో ఖాళీ అవుతున్న 56 స్థానాల భర్తీకి ఎన్నికల కమిషన్ సోమవారం షెడ్యూలు విడుదల చేసింది.

రాజ్యసభ ఎన్నికలకు ఫిబ్రవరి ఎనిమిదిన నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకూ నామినేషన్ల దాఖలు చేయొచ్చు. 16వ తేదీన పరిశీలన జరుగుతుంది. 20వ తేదీన ఉపసంహరణకు చివరితేదీగా ప్రకటించారు. 27న ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగు జరుగుతుంది. సాయంత్రం ఐదుగంటల నుండి లెక్కింపు మొదలవుతుంది. అదేరోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఈ మేరకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 56 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుంది. వీటిలో రాష్ట్రంలో మూడు స్థానాలున్నాయి. సి.ఎం.రమేష్, కనకమేడల రవీంద్రకుమార్, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిల స్థానాలను భర్తీ చేయనున్నారు.

రాష్ట్రంలో పోటీ తప్పదా?

రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు స్థానాలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇక్కడ వైసిపి ముగ్గురు అభ్యర్థులను నిలబెడుతుండగా, టిడిపి కూడా ఒక అభ్యర్థిని పోటీలో పెట్టనుంది. వైసిపి తరుపున వై.వి.సుబ్బారెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఎ.శ్రీనివాసులు, పాయకరావుపేట ఎమ్మెల్యే జి.బాబూరావు పోటీ చేయనున్నట్లు తెలిసింది. టిడిపి తరుపున అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదు. ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని రద్దు చేశారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

● ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల సందర్భంగా డ్రైవర్లకు తీవ్రమైన శిక్షలను విధించేలా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహితలోని 106(1), 106(2) చట్ట సవరణను ఉపసంహరించాలని ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ఆర్‌టిసి ఉద్యోగ సంఘాల సమావేశం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ నుంచి ఎం శంకర్రావు, ఎన్‌ఎంయు నుంచి కె శ్రీనివాసరాజు, ఎస్‌డబ్ల్యుఎఫ్ నుంచి ఎస్‌కె జిలాని బాషా, ఎం అయ్యపురెడ్డి, డి మల్లికార్జున, బిసి అసోసియేషన్ నుంచి ఎస్‌పి శేషగిరి, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నుంచి పి కిరణ్, సూపర్‌వైజర్స్ అసోసియేషన్ నుంచి ఎంఎ విష్ణారెడ్డి, సిహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో శిక్షపడేలా తీసుకొచ్చిన చట్ట సవరణను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న జరిగే జాతీయ కార్మిక సమ్మెలో పెద్దయెత్తున డ్రైవర్లు పాల్గొనాలని సమావేశం తీర్మానం చేసింది. రవాణా రంగానికి ముప్పుగా మారే ఈ చట్టసవరణ రద్దు కోసం అన్ని రాజకీయ పార్టీలకూ వినతిపత్రాలివ్వా లని సమావేశం నిర్ణయించింది.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఇద్దరు మృతి : పలు చర్చిల దగ్ధం

• లోపలి పేజీలో.. •



ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న ఎం.వేణుగోపాలరావు, వేదికపై ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి తదితరులు

విద్యుత్ సంస్కరణలతో

ప్రజలపై భారం

● ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో నిపుణులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన విద్యుత్ సంస్కరణలు ప్రజలపై వివిధ భారాలు మోపుతున్నాయని విద్యుత్ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి డిస్కములు ప్రతిపాదించిన ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ సోమవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి అధ్యక్షతన ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమం జరిగింది. జస్టిస్ నాగార్జున రెడ్డి ప్రారంభోపన్యాసం చేస్తూ గృహ విద్యుత్ వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల పెంపునకు డిస్కంలు ఎటువంటి ప్రతిపాదనలూ చేయలేదని చెప్పారు. 2021లో విద్యుత్ నియంత్రణ మండలి తీసుకొచ్చిన సవరణ ద్వారా నిర్దేశిత కాల పరిమితిలో నిర్దేశించిన సేవలను అందించనట్లయితే వినియోగదారునికి పరిహారం చెల్లించవలసిందిగా నిబంధన తీసుకొచ్చినట్టు తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 20,190 మంది వినియోగదారులకు రూ.52 లక్షలు, 2023-24 మొదటి త్రైమాసికం ముగిసేనాటికి 5,754 మంది వినియోగదారులకు రూ.6.5 లక్షలు పరిహారాన్ని విద్యుత్ పంపిణీ సంస్థలు చెల్లించాయని తెలిపారు. డిస్కములకు చెల్లింపులను హేతుబద్ధం చేస్తూ మూతబడిన పరిశ్రమలను పునరుద్ధరించడానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సిక్ ఇండస్ట్రియల్ రివైవల్ పాలసీని కమిషన్ ఆమోదించిందని చెప్పారు. ట్రాన్స్‌కో జెఎండి కెవిఎన్ చక్రధర్‌బాబు, ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఐ పృధ్వీతేజ్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి కె సంతోషరావు వారి సంస్థల నివేదికలను చదివి వివరించారు. అనంతరం విద్యుత్ రంగ నిపుణులు ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ.. డిస్కాములు అవాస్తవిక రెవెన్యూ లోటును చూపిస్తూ వినియోగదారులపై ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్ కింద భారాలు మోపుతున్నాయని చెప్పారు. ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్ రూపాల్లోనే నాలుగేళ్లలో రూ.10 వేలకోట్ల భారం ప్రజలపై మోపాయని చెప్పారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్‌ను ఎక్కడా అమ్మడం లేదన్నారు. మరోవైపు అధిక ధరకు మార్కెట్ నుంచి డిస్కంలు కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. అవసరం లేకుండా స్వల్ప కాలిక ఒప్పందాల పేరుతో విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయని అన్నారు. అనుమతి ఇచ్చిన పరిధి దాటి విద్యుత్ కొనుగోలు చేస్తున్నా నియంత్రణ మండలి అరికట్టలేపోతుందన్నారు. ప్రజలపై వివిధ భారాలు మోపుతున్నా కూడా మిగతా 2లో

బిజెపి బెదిరింపులను టిడిపి ఎదుర్కోవాలి

● ప్రత్యేక హోదాపై గళం విప్పినందుకే గల్లాపై ఇడి దాడులు : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

బిజెపి బెదిరింపులను తెలుగుదేశం పార్టీ గట్టిగా ఎదుర్కోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆయన ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన సిపిఎం జిల్లా కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంటులో ప్రత్యేక హోదా కోసం ఎంపి గల్లా జయదేవ్ గళం విప్పినందుకే ఆయనపై బిజెపి కక్షపూరిత ధోరణితో ఇడిని ప్రయోగించిందన్నారు. బిజెపి ఒత్తిడితోనే ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో గల్లా జయదేవ్ కుటుంబానికి చెందిన పరిశ్రమలను బయటకు నెట్టినట్లు స్పష్టమవుతోందని తెలిపారు. బిజెపి నిరంకుశ, కక్ష సాధింపు చర్యలను ఎదుర్కొనేందుకు టిడిపి ముందుకు రావాలని కోరారు. బిజెపి ఒత్తిడి, సూచనలు, సలహాలతోనే రాష్ట్రంలో జగన్ పాలన సాగిస్తున్నారని సిపిఎం మొదట నుంచీ చెబుతోందని గుర్తు చేశారు. ఇప్పటికైనా టిడిపితోపాటు ఇతర పార్టీలు ఈ వాస్తవాన్ని గుర్తించాలని కోరారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ రాజమండ్రిలో యుటిఎఫ్ నిర్వహించిన ఉపాధ్యాయ సదస్సుకు వైసిపి, టిడిపి గైర్హాజరు కావడాన్ని శ్రీనివాసరావు తప్పుబట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు తమ ముఖం చూపించడానికి ఈ రెండు పార్టీలూ భయపడుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలతోపాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షర్మిల గట్టిగా గళం విప్పడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా, పరిశ్రమలు రాకుండా చేస్తోన్న పాపం బిజెపిదేనన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో బిజెపిని, దానికి మద్దతుగా ఉన్న పార్టీలను ఓడించాలన్నారు.

'వెలిగొండ'పై రైతులను మభ్యపెడుతున్న వైసిపి

వెలిగొండ ప్రాజెక్టుపై రైతులను వైసిపి మభ్యపెడుతోందని వి.శ్రీనివాసరావు విమర్శించారు. రెండు సొరంగాలు పూర్తి చేయడానికి 18 ఏళ్లు పట్టిందన్నారు. దీనికి సిగ్గుపడకపోగా ఇప్పుడు నీళ్లు ఇవ్వకుండానే ఏదో సాధించామంటూ గొప్పలు చెప్పుకోవడం గర్హనీయమన్నారు. ఇప్పటికీ అప్రోచ్ ఛానళ్లు పూర్తి కాలేదని తెలిపారు. పునరావాసానికి అతీగతీ లేదని, నిర్వాసితులకు ప్యాకేజీలు అందలేదని చెప్పారు. నిర్వాసితులను ముప్పుతిప్పలు పెడుతున్నారని విమర్శించారు. పునరావాసం కల్పించకుండా, రైతులను గ్రామాల నుంచి ఖాళీ చేయించకుండా నీళ్లివ్వడం సాధ్యమా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను, ప్రజలను మభ్యపెట్టేందుకు ఈ ప్రచారాలు సాగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని పనులూ పూర్తి చేశాకే నీళ్లివ్వాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పాల్గొన్నారు.



'సాక్షి'లో నాకూ వాటా ఉంది

● నా పత్రికల్లో నాపై తప్పుడు రాతలు : షర్మిల

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

● రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద పెన్షనర్ల ధర్నా

• లోపలి పేజీలో.. •

బిసి భవన్ ముట్టడి

తక్షణం నిధులు విడుదల చేయాలని రజకులు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాలుగున్నరేళ్ల కాలంలో నిధులు కేటాయించకుండా వైసిపి ప్రభుత్వం రజకులను మోసం చేసిందని, ఆ మొత్తాన్ని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రజకులు పెద్ద సంఖ్యలో బిసి భవన్‌ను ముట్టడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఎపి రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో తరలివచ్చిన రజకులు సోమవారం విజయవాడ గొల్లపూడిలోని బిసి భవన్‌ను ముట్టడించారు. బిసిభవన్ గేట్ ముందు బైఠాయించారు. రజకుల కోసం అట్రాసిటి చట్టాన్ని రూపొందించాలని, 50ఏళ్లకు వృద్ధాప్య పింఛన్‌ను ఇవ్వాలని, దోభీఘాట్‌లను నిర్మించాలని, రజక ఫెడరేషన్‌లకు నిధులను కేటాయించాలని, రజక కార్పొరేషన్‌కు అధికారాలు కల్పించి, రజకులకు ఆర్థిక సాయం అందించేలా విధానాన్ని రూపొందించాలని నినాదాలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో గేట్‌ను దాటి కార్యాలయ ఆవరణలోకి చొచ్చుకు పోయారు. కార్యాలయ ఆవరణలోనూ బైఠాయించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో రజక కార్పొరేషన్ ఎమ్‌డి మల్లికార్జునరావు వచ్చి ఎపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించకుండా ఛైర్మన్‌ను, 12 మంది డైరక్టర్‌లను నియమిస్తే రజకుల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ నాలుగున్నర ఏళ్లలో కేవలం ఒక్కసారి మాత్రమే రజక కార్పొరేషన్ బోర్డు మీటింగ్ జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ఆ ఒక్క సమావేశంలోనూ చేసిన తీర్మానాలను ఇప్పటిదాకా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.. చాలా గ్రామాల్లో రజకులను సామాజిక బహిష్కరణ చేస్తున్నారని, తమకు కూడా అట్రాసిటి చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్‌డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రేకుల గుంట అంకయ్య, మల్లేశ్వరరావు, లింగాల నిర్మలమ్మ, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పాగోలు శ్రీనివాసరావు, వెంకట నరసయ్య, నాగేశ్వరరావు, పాండురంగారావు, మాల కొండయ్య పాల్గొన్నారు.



బిసి భవన్‌ను ముట్టడించిన రజక వృత్తిదారులు

హామీల ఉల్లంఘనలో నేర్పరి

● జగన్ 99 % అమలు చేశానడం బూటకం
● సొంత చెల్లితోపాటు ప్రజలనూ మోసగించారు
● రా... కదలిరా సభల్లో చంద్రబాబు



గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి- గుంటూరు, రాజమహేంద్రవరం ప్రతినిధులు

రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించడంలో సిఎం జగన్ మంచి నేర్పరని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోనూ, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కాతేరులోనూ 'రా... కదలిరా' పేరుతో సోమవారం నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ ఇచ్చిన హామీల వీడియోలను వడ్లమూడి సభలో ప్రదర్శించారు. వైసిపి అధికారంలోకి వస్తే ఉద్యోగులకు మెరుగైన పిఆర్‌సి ఇస్తానని, వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేశానని, ప్రజలకు భారంగా ఉన్న విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తానని, ఏటా జాబ్ కేలండర్, డిఎస్‌సి నియామకాలు, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాజధాని అమరావతి అభివృద్ధి, 2021 జూన్ కల్లా పోలవరం పూర్తి, ప్రత్యేక హోదా, బిసి సబ్‌ప్లాన్, పంటలకు మద్దతు ధర, కాపు కార్పొరేషన్‌కు రూ.10 వేల కోట్ల నిధులు, నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపు, 2024 నాటికి మద్యనిషేధం చేశాకే ఓట్లు అడుగుతా అని చెప్పిన హామీల వీడియోలు వీటిలో ఉన్నాయి. ఈ హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, అమలు చేశానంటూ జగన్ అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ఆడపిల్లలకు ఆస్తిలో సమాన వాటా ఇవ్వాల్సి ఉండగా, సొంత చెల్లెలుకు ఆస్తి ఇవ్వకుండా జగన్ మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రజలను వాగ్దానాలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే సామాజిక పింఛన్ల లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి డబ్బులు అందిస్తామని, ఒక నెలలో పింఛను తీసుకోని వారు మూడు నెలల్లోపు ఎప్పుడైనా తీసుకునే వెసులుబాటు కల్పిస్తామని అన్నారు. వైసిపిలో తిరుగుబాటు మొదలైందని, తాను గేట్లు తెరిస్తే ఆ పార్టీ నుంచి సగం మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పార్టీలోకి వస్తారని పేర్కొన్నారు. జగన్ క్యాబినెట్‌లో పది మంది మంత్రులకు మిగతా 2లో

'సుప్రీం'లో చంద్రబాబుకు ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు ఊరట లభించింది. ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. చంద్రబాబుకు మంజూరైన ముందస్తు బెయిల్‌ను సమర్థించింది. ఐఆర్‌ఆర్ కేసులో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గతంలో ఇదే కేసులో దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పిని సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎపి హైకోర్టు అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకునే ఉత్తర్వులిచ్చిందని అభిప్రాయపడింది. కేసు దర్యాప్తుపై ముందస్తు బెయిల్ ప్రభావం ఉండదని వ్యాఖ్యానించింది. చంద్రబాబు విచారణకు సహకరించకపోతే బెయిల్ రద్దు పిటిషన్ వేసుకోవచ్చని తెలిపింది. దీనిపై చంద్రబాబుకు నోటీసులిచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరిస్తూ.. ప్రస్తుతం ఈ దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

రేపటి నుంచి బడ్జెట్ సమావేశాలు

● నేడు అఖిలపక్షం భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



మోడీ ప్రభుత్వ చివరి పార్లమెంటు (బడ్జెట్) సమావేశాలు బుధవారం నుంచి జరగనున్నాయి. ఈ క్రమంలో కేంద్రం మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సభ సజావుగా సాగడంతోపాటు ముఖ్యమైన అంశాలపై భేటీలో చర్చించే అవకాశం ఉన్నది. ఇక లోక్‌సభ చివరి సమావేశాలు జనవరి 31న ప్రారంభమై.. ఫిబ్రవరి 9 వరకూ జరగనున్నాయి. బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తరువాత ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉంటుంది. మధ్యంతర బడ్జెట్‌పై కూడా చర్చించనున్నారు. పార్లమెంటు సమావేశాలు కేవలం పది రోజులే కావడంతో, ఈ స్వల్ప కాలంలో ఏయే అంశాలు లేవనెత్తాలో ప్రతిపక్షాలు చర్చిస్తున్నాయి. 17వ లోక్‌సభ గడువు జూన్ 16న ముగియనున్నది. సార్వత్రిక ఎన్నికల ముందు పార్లమెంటు సమావేశం కావడం ఇదే చివరిసారి.

అమ్మా.. నాన్నా.. క్షమించండి

● కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం
● ఈ నెలలో ఇది రెండో ఆత్మహత్య

7

రాజీనామా ఆమోదంపై హైకోర్టుకు గంటా

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ తూర్పు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాను శాసనసభ స్పీకరు ఆమోదించిన ఉత్తర్వులను నోటిఫై చేసి గెజిట్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. స్పీకరు ఉత్తర్వులను నోటిఫై చేస్తూ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌కు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని హైకోర్టు ఆదేశించింది. గంటా శ్రీనివాసరావు రాజీనామా లేఖతోపాటు ఇతర ఆధారాలను నివేదించాలంది. శాసనసభ సెక్రటరీ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చాలని గంటాను ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేస్తూ జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఆదేశాలిచ్చారు. ఈ నెల 23న స్పీకరు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని గంటా తరపు న్యాయవాది ఎన్ అశ్వనీ కుమార్ కోరారు. 2021లో రాజీనామా చేస్తే మూడేళ్ల తర్వాత ఆమోదించారని చెప్పారు. రాజీనామా వద్దనుకుని ఉంటే దానిని వెనక్కి తీసుకుని ఉండాల్సిందని న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వేలూరి మహేశ్వరరెడ్డి ప్రతివాదన చేశారు. సెక్రటరీ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చలేదని తప్పుపట్టారు. విచారణ ఫిబ్రవరి 19కి వాయిదా పడింది.

నల్లజర్ల మండలంలో పులి సంచారం

- పాదముద్రలను గుర్తించిన అటవీ అధికారులు

ప్రజాశక్తి- నల్లజర్ల(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అయ్యవరం గ్రామంలో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ప్రజలను అప్రమత్తం చేశారు. అయ్యవరం గ్రామంలోని సబ్‌స్టేషన్ సమీపంలో కోకో తోట ఉంది. ఈ తోటలో పులి సంచరించినట్లుగా ఫారెస్ట్ అధికారుల బృందం నిర్ధారించింది. తోటలో పులి పాదముద్రలను గుర్తించామని, తాము చెప్పేవరకూ ఎవరూ పొలాల్లోకి వెళ్లొద్దని వారు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు వలంటీర్లను అప్రమత్తం చేశారు. అటవీప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అయ్యవరం, ముసుళ్లకుంట, దూబచర్ల, ఘంటావారిగూడెం, పుల్లలపాడు, చీపురుగూడెం గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ పులి తిరిగి అడవిలోకి వెళ్లిపోతున్నట్టు అధికారులు తెలిపారు. అయితే, ఈ విషయాన్ని ధ్రువీకరించాల్సి ఉందన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిద్ధార్థ ఐఎఎస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న గ్రూప్-2 మైనార్టీ అభ్యర్థులకు పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందించారు. మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎమ్‌డి ఇంతియాజ్, సిఇడిఎం డైరెక్టర్ ఎమ్‌డి మస్తాన్ వలి, ఎపిఎంఎస్‌డిసి జిఎం ఇ మురళి, విజయవాడ సౌత్ సెంటర్ ఎసిపి బి రవికిరణ్, సిద్ధార్థ ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ మన్నం రాజారావు, ట్రస్టు చైర్మన్ అంద్ర మాల్యాద్రి, శ్రీనిధి ఎమ్‌డి నాంచారయ్య, ఆచార్య సిరికొండ లెనిన్, ఇ అంజయ్య, కండెల్లి సురేంద్ర, సుమమాల జాన్ రత్నం తదితరులు ఈ కార్యక్రమానికి అతిథులుగా పాల్గొన్నారు. పట్టుదల, ఆత్మ విశ్వాసంతో పాటు సాధించాలనే తపనతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని అతిథులు అన్నారు. పుస్తకాల అధ్యయనంతోపాటు ప్రస్తుత సమాజాన్ని తప్పక చదవాలని చెప్పారు. సేవా దృక్పథంతో ప్రతిఒక్కరూ ఉండాలని సూచించారు. మహనీయుల స్ఫూర్తితో సమాజంలో ఉన్న అసమానతలకు వ్యతిరేకంగా పనిచేయాలని కోరారు. భారత రాజ్యాంగం, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రమాదంలో పడ్డాయని, వీటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాల్యాద్రి అన్నారు.

హామీల ఉల్లంఘనలో నేర్పరి

(మొదటిపేజీ తరువాయి)

సీట్లు మార్చారంటే వారంతా ఓడిపోతారని అంగీకరించనట్టేనని ఎద్దేవా చేశారు. 68 మంది ఎమ్మెల్యేలను మార్చారని, వారిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలే ఎక్కువగా ఉన్నారని వివరించారు. టిడిపి-జనసేన పొత్తు అనగానే వైసిపి నేతలకు నిద్రపట్టడం లేదన్నారు. వైసిపిలో దళిత ఎమ్మెల్యేలపై దాడి చేస్తున్నారనే దానికి ఆ పార్టీ ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన వ్యాఖ్యలు నిదర్శమని పేర్కొన్నారు. వైసిపి హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. సామాజిక న్యాయం అంటూనే తన సామాజిక తరగతికి చెందిన సామంతులతో పాలన చేస్తున్నాడని ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి అన్నారు. పదో తరగతి విద్యార్థి, బిసి బిడ్డ అమర్నాథ్‌ను హత్య చేసిన వారు బయట తిరగడమే సామాజిక న్యాయమా? దళిత యువకుడు శ్రీను జైల్లో, జగన్ బాబాయి వైఎస్.వివేకానంద హంతకులు బయట ఉండడమే సామాజిక న్యాయమా? అని ప్రశ్నించారు. రాజకీయ విమర్శలు సర్వసాధారణమని, అయితే తన ఫొటో, పవన్ కల్యాణ్ ఫొటోలు పెట్టి బూటు కాలితో తన్నించడం వంటి చర్యలకు పాల్పడే వారిని ఏమనాలి? ఇలాంటి చర్యలను నాగరిక ప్రపంచం అనుమతిస్తుందా? అని ప్రశ్నించారు. టిడిపి హయాంలో 72 శాతం పోలవరం పూర్తి చేస్తే దాన్ని జగన్ నాశనం చేశారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకూ రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని, వర్క్ ఫ్రమ్ హోంకు శ్రీకారం చుడతానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద పెన్షనర్ల ధర్నా



నెల్లూరు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-యంత్రాంగం

పెన్షనర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి పెన్షనర్ల అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద పెన్షనర్లు ధర్నా చేపట్టారు. గుంటూరు ధర్నాలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు పాల్గొని సంఘీభావంగా మాట్లాడారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ గతంలో ఇస్తున్నట్లు 70 ఏళ్లు నిండిన వారికి 10 శాతం, 75 ఏళ్లు నిండిన వారికి 15 శాతం పునరుద్ధరించాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తమ వంతు కృషి చేస్తారని అన్నారు. ధర్నాలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి వెంకటేశ్వర్లు, జి ప్రభుదాసు ప్రసంగించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ధర్నా చౌక్‌లో ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ఎల్ శివశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, జెఎసి జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం సంఘీభావం తెలిపారు.

నెల్లూరు ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో ఒకరిగా పెన్షనర్లను ప్రభుత్వం గుర్తించి న్యాయమైన కోర్కెలను ఎన్నికల కోడ్ వచ్చేలోగా పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వం పెన్షనర్ల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. పెన్షనర్లు సంఘటితంగా ఉంటేనే సమస్యలను సులువుగా సాధించుకోగలమని తెలిపారు.

వైఎస్ఆర్ కడప జిల్లా ధర్నాలో రాష్ట్ర జెఎసి ఉప కార్యదర్శి హృదయరాజు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం ప్రజలకు, ప్రభుత్వాలకు వారధులుగా నిలిచి, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ పెన్షనర్లు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రోడ్డెక్కించే పరిస్థితిని తేవడం ఏ ప్రభుత్వానికీ మంచిది కాదని అన్నారు. ప్రతి నెల1వ తేదీన పెన్షనర్లకు పెన్షన్ మంజూరు చేయమని డిమాండ్ చేశారు.

అనంతపురం, సత్యసాయి జిల్లా, ఒంగోలు, బాపట్ల, విజయనగరం, పార్వతీపురం కలెక్టరేట్ల వద్ద పెన్షనర్లు ధర్నా చేశారు.

టెక్స్‌టైల్స్ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతమైన పరిధిని కలిగిన టెక్నికల్ టెక్స్‌టైల్స్ ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వ నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్‌లో భాగంగా విజయవాడలో రాష్ట్ర చేనేత జౌళిశాఖ జాతీయ స్థాయిలో సాంకేతిక వస్త్రాల అభివృద్ధి కోసం విధాన మార్గాల రూపకల్పన ప్రధాన అంశంగా సోమవారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. సదస్సులో కేంద్ర జౌళిశాఖ సంయుక్త కార్యదర్శి రాజీవ్ సక్సేనా మాట్లాడు తూ.. రానున్న కాలంలో దేశాభివృద్ధిలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగం కీలక భూమిక పోషించనుందన్నారు. ఈ రంగానికి నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం ఎంతో ఉందన్నారు. టెక్నికల్ టెక్స్ టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి నిధుల కొరత లేదని, కేవలం పరిశోధన కోసమే రూ.వెయ్యి కోట్లు కేటాయించామన్నారు. యువతను ఆకర్షించేలా టెక్ని కల్ టెక్స్‌టైల్స్ రంగంలో యుజి, పిజి కోర్సులు రూపకల్పన జరుగుతుందన్నారు.

చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి సునీత మాట్లాడుతూ.. వ్యవసాయ టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగం ద్వారా వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకో గలుగుతా మన్నారు. ఆక్వా రంగం టెక్నికల్ పెద్ద వినియోగదారునిగా ఉందని, ఈ రంగం నుంచి డిమాండ్ గణనీయంగా ఉందని అన్నారు. ఇండియన్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షులు అవినాష్ మైసర్ మాట్లాడుతూ.. సమగ్ర విధి విధానాల రూపకల్పనతో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగం పురోగతిని సాధించనుందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ కమిషనరు ఎంఎం నాయక్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త అజయ్ శిరోషి మాట్లాడుతూ.. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వ స్పందన బాగుందన్నారు.

యువతను నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొట్టాలి

- వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా మతోన్మాదం వైపు తీసుకెళ్లి వారిని నిర్వీర్యం చేసే ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టాలని ఎఐవైఎఫ్ నిర్వహించిన సదస్సులో వక్తలు అన్నారు. 'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా' పేరుతో విజయవాడ లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. అధికారం కోసం రాజకీయ పార్టీలు అమలు కాని వాగ్దానాలు చేస్తున్నాయని అన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదన్నారు. ప్రజలకు ఏం చేసిందో చెప్పలేని పరిస్థితిలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలను అణచివేసి మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని, నల్లధనాన్ని వెనక్కు తీసుకురాలేదని అన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చి యువతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, ఆరోగ్యం, నివాసం అంశాల్లో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని అన్నారు. ఐఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి ఈశ్వరయ్య మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కోసం షరతులు లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిల్లో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎఐవైఎఫ్ అధ్యక్షులు పి రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు వల్లిఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శివారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సరస్వతి, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి నరేష్ ప్రసంగించారు.

'సాక్షి'లో నాకూ వాటా ఉంది

- నా పత్రికల్లో నాపై తప్పుడు రాతలు : షర్మిల


ఇడుపులపాయలో సునీతతో కలిసి వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న షర్మిల

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/వేంపల్లె

సాక్షిలో తనకు సమాన వాటా ఉందని నా తండ్రి రాజశేఖర్‌రెడ్డి చెప్పారని పిసిసి ఛీఫ్ షర్మిల తెలిపారు. తన పత్రికలో తనపై తప్పుడు వార్తలు రాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు ఏం రాసినా, ఏం చేసినా భయపడే ప్రసక్తే లేదన్నారు. ఉమ్మడి కడప, కర్నూలులో జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు సోమవారం ఆమె నిర్వహించారు. షర్మిల మాట్లాడుతూ.. బిజెపి ఓ మతతత్వ పార్టీ, మతాల మధ్య చిచ్చు పెట్టి చలికాచుకోవడమే బిజెపికి తెలుసు అని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వంలో ముస్లిములకు, క్రైస్తవులకు భద్రత లేదని తెలిపారు. ప్రత్యేకహోదా కోసమే పొత్తు పెట్టుకున్నామని చంద్రబాబు చెప్పారని, అధికారంలోకి వచ్చాక హోదా కోసం పోరాటం చేస్తే కేసులు పెట్టారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్ హోదా కోసం నిరాహార దీక్ష చేశారని, సిఎం అయ్యాక ఒక్కరోజైనా హోదా కోసం పోరాటం చేశారా? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు స్పెషల్ ప్యాకేజీ, పోలవరం, రాజధాని, రైల్వేజోన్, కడప-బెంగళూరు రైల్వేలైన్, కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణ హామీలను రాబట్టుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. బిజెపితో దోస్తీ చేసి ఏమి సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ సంక్షేమ పాలనకు జగన్ పాలనకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. ప్రభుత్వ పాలసీలపై మాట్లాడుతున్న తనపై సోషల్ మీడియా జోకర్లు వ్యక్తిగతంగా దాడులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలులో గాయత్రి హాస్పిటల్ అధినేత జిలానీ బాషా, వైఎస్ఆర్ జిల్లా బద్వేలు నియోజకవర్గానికి చెందిన రాజకీయ నాయకులు విజయజ్యోతి సహ పలువురికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి షర్మిల స్వాగతం పలికారు. ఖాజీపేటలో మాజీమంత్రి డిఎల్ రవీంద్రారెడ్డిని కలిసి చర్చలు జరిపారు. సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి, ఎపిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్, మాజీ మంత్రులు మూలింటి మారెప్ప, అహ్మదుల్లా, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలతో సునీత భేటీ

ఇడుపులపాయలో బస చేసిన పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిలతో మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్.సునీత భేటీ అయ్యారు. హైదరాబాద్ నుంచి నేరుగా ఇడుపులపాయకు చేరుకొని తన సోదరి షర్మిలను కలిశారు. అనంతరం వైఎస్ఆర్‌కు షర్మిల, సునీత, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. సుమారు రెండుగంటలపాటు షర్మిలతో సునీత భేటీ అయ్యారు. సునీత కాంగ్రెస్‌లో చేరుతారనే చర్చ సాగుతోంది.



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

విద్యుత్ భారాలపై వామపక్షాల నిరసన

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

విద్యుత్ ఛార్జీల పెంపు జోలికి వెళ్లబోమని, ఉన్న ఛార్జీలు తగ్గించి ప్రజలకు సుపరిపాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తన పాలనలో వరుసగా ఐదోసారి విద్యుత్ ఛార్జీల మోతకు సిద్ధమవుతోందంటూ వామపక్ష పార్టీల నాయకులు మండిపడ్డారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడాన్ని నిరసిస్తూ విశాఖ గురుద్వారా సమీపాన ఉన్న ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ బూటకపు అభిప్రాయ సేకరణ అని మండిపడ్డారు. గతంలో టిడిపి విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని విమర్శిస్తూ... తాను వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచనని చెప్పిన జగన్ అధికారం చేపట్టాక మాట తప్పారన్నారు. ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఆర్థిక సంస్కరణలను అమలు చేస్తూ మోడీకి తొత్తుగా మారారని విమర్శించారు.

గతంలో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల ఆగ్రహానికి గురై ఇంటికి వెళ్లిన ప్రభుత్వాల గతే నేటి ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, వామపక్ష పార్టీల నాయకులు కృష్ణారావు, నాయనిబాబు, జి.రాంబాబు, ఎస్‌కె.రెహమాన్, ఎం.మన్మధరావు, కొండయ్య, కుమారి పాల్గొన్నారు.

'శుభం మహేశ్వరి' బాధిత రైతులకు న్యాయం చేయాలి

- వ్యవసాయశాఖ మంత్రికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దుగ్గిరాలలో కాలిపోయిన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో పంటను నిల్వ చేసిన రైతులందరికీ న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె పభాకరరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి లేఖ రాశారు. అన్ని విచారణలూ వెంటనే పూర్తి చేయాలని, రికార్డులు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధిత రైతుల పేర్లు ప్రకటించాలని, మాస్టర్ ఇన్సూరెన్స్ పాలసీ బయటపెట్టాలని కోరారు. అలాగే ప్రస్తుత మార్కెట్ విలువను రైతులకు చెల్లిస్తామని యాజమాన్యం రైతులతో ఒప్పందం చేసుకోవాలని, ఒక కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇన్సూరెన్స్ కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం చెల్లిస్తే మిగిలింది ప్రభుత్వం చెల్లించేలా చూడాలని కోరారు. బ్యాంకు అప్పులు, వడ్డీలు, కౌలు చెల్లింపులు రద్దు చేయాలని వారు కోరారు.

ప్రజలపై భారం

(మొదటిపేజీ తరువాయి)

డిస్కంలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని చెప్పారు. 2023 మార్చి నాటికి మూడు డిస్కంలు రూ.24,979 కోట్ల నష్టాల్లో ఉన్నాయని, ప్రభుత్వం నుంచి రూ.22,230 కోట్లు రావాల్సి ఉందని, బకాయిలు రూ.15 వేల కోట్లు రావాలని వివరించారు. డిస్కంలు విద్యుదుత్పత్తి సంస్థలకు రూ.9,224 కోట్లు బకాయిలు పెట్టాయని తెలిపారు. ఇవి కాకుండా డిస్కంలకు అప్పులు రూ.57,453 కోట్లు పేరుకుపోయాయని చెప్పారు. మరో విద్యుత్ రంగ నిపుణులు ఎ పున్నారావు మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యం కేసులపై దృష్టి సారించే విధంగా డిస్కంలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎపి టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ నుంచి గోపాల్ చౌదరి తదితరులు పాల్గొని వారి అభ్యంతరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఇఆర్‌సి సభ్యులు ఠాకూర్ రామసింగ్, పివిఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.3.40 కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులోని ఆకృతి వస్త్ర దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ. 3.40 కోట్ల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు దుకాణ యజమాని తెలిపారు. స్థానికుల వివరాల మేరకు.. సోమవారం తెల్లవారుజామున మూడంతస్తుల భవనంలోని పై ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బట్టలు కాలిపోవడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు ఆర్పేక్రమంలో ఫైర్‌మాన్ సాంబశివారెడ్డి స్పృహ తప్పి పడిపోయారు. దాదాపు రెండున్నర గంటల పాటు సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. రూ.2. 20 కోట్ల చీరలు, డ్రెస్ మెటీరియల్స్, రూ. 1.20 కోట్ల ఫర్నీచర్, గాజుగ్లాసులు మొత్తం కలిపి రూ. 3.40 కోట్ల మేర నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు.



దీక్షల్లో కూర్చున్న ఐద్వా నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి పద్మ, వై సత్యవతి అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 1033వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విలువైన భూములను కాజేయడం కోసం మోడీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందన్నారు. బిజెపి ఎంపి జివిఎల్ నర్సింహారావు స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడంలేదని ప్రకటనలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవడం, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. రూ.మూడు లక్షల కోట్ల విలువగల స్టీల్‌ప్లాంట్‌ను రూ.30 వేల కోట్లకు కట్టబెట్టే చర్యలకు పాల్పడడాన్ని ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. గాలి జనార్ధనరెడ్డికి ఏ పరిశ్రమా లేకపోయినా బొగ్గు గనులు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో బిజెపికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కె వేణు, బొట్టా ఈశ్వరమ్మ, కె సంతోషం, కె కుమారి, బి భారతి, కె సుజాత, ఎం వేణమ్మ పాల్గొన్నారు.

అటవీ కార్మికుల దీక్ష భగ్నం

- మురళి సహా తొమ్మిది మందిని అరెస్టు చేసి ఆస్పత్రికి తరలింపు
- కొత్తగా ఐదుగురు నిరవధిక నిరాహార దీక్ష


కందారపు మురళిని శిబిరం నుంచి బలవంతంగా ఈడ్చుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి- తిరుపతి

నిరవధిక నిరాహార దీక్షకు దిగిన సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళితో సహా తొమ్మిది మంది అటవీ కార్మికులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి రుయా ఆస్పత్రికి తరలించారు. తమను పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టిటిడి అటవీ కార్మికులు 38 నెలలుగా రిలే దీక్షలు చేస్తున్నా టిటిడి న్యాయం చేయకపోవడంతో గత శనివారం నుంచి మురళితో సహా తొమ్మిది మంది కార్మికులు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో దీక్షా శిబిరం వద్దకు పోలీసులు వచ్చారు. దీక్షల్లో కూర్చున్న వారిని బలవంతంగా అరెస్టు చేసి రుయా ఆస్పత్రికి తరలించారు. వీరి ఆరోగ్యం క్షీణిస్తోందంటూ రుయా వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక పేరుతో దీక్షలను భగ్నం చేయడానికి ఈ విధంగా చేశారు. పోలీసుల చర్యలను కార్మికులు నిరసించారు. ఈ శిబిరంలో కొత్తగా ఐదుగురు కార్మికులు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు.

30 మంది ఐపిఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో 30 మంది ఐపిఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఇద్దరు అదనపు డిజిలు, ఇద్దరు ఐజిలు ఉన్నారు.

అధికారి	ప్రస్తుతం	బదిలీ స్థానం
కుమార విశ్వజిత్	ఎడిజి విజిలెన్స్	ఎడిజిపి రైల్వే
అతుల్ సింగ్	ఎడిజి రిక్రూట్‌మెంట్స్‌ఎడిజిపి	ఎపిఎస్‌పి
సిహెచ్.శ్రీకాంత్	ఐజి సిఐడి	ఐజి ఆక్టోపస్
కొల్లి రఘురామరెడ్డి	ఐజి ఇంటిలిజెన్స్	విజిలెన్స్, డ్రగ్ కంట్రోల్
ఎస్.వి.రాజశేఖరబాబు		ఛైర్మన్ రిక్రూట్‌మెంట్స్
సర్వశ్రేష్ట త్రిపాఠి	ఐజి అడ్మిన్ డిజిపి ఆఫీసు	ఐజి సిఐడి
ఎస్.హరికృష్ణ	డిఐజి విశాఖపట్నం	ఐజి డిజిపి కార్యాలయం
కె.వి.మోహనరావు	డిఐజి, డిజిపి ఆఫీసు	స్పోర్ట్స్ విభాగం
సెంథిల్‌కుమార్	డిఐజి కర్నూలు	డిఐజి ఆక్టోపస్
రాహుల్‌దేవ్‌శర్మ	డిఐజి 5వ బెటాలియన్	డిజిపి ఆఫీసు
విశాల్ గున్నీ	డిసిపి విజయవాడ	డిఐజి విశాఖపట్నం
విజయరావు	3వబెటాలియన్ కమాండెంట్	డిఐజి కర్నూలు
ఫకీరప్ప	ఎస్‌పి సిఐడి	జాయింట్ కమిషనర్ విశాఖ
అద్నమ్ నారాయణ అస్మి	ఎస్‌పి ఎసిబి	ఎస్‌పి కృష్ణ
అమిత్ బర్దార్	ఎస్‌పి సిఐడి	జాయింట్ కమిషనర్ విశాఖ
ఆరిఫ్ హఫీజ్	ఎస్‌పి గుంటూరు	ఎస్‌పి ఐఎస్‌డబ్ల్యు
అజిత వేజెండ్ల	డిజిపి విజయవాడ	ఎస్‌పి పశ్చిమగోదావరి
కెఎస్ఎస్‌వి సుబ్బారెడ్డి		విఇ రాజమండ్రి
పి.జాషువ	ఎస్‌పి కృష్ణ	ఎస్‌పి చిత్తూరు
యు రవిప్రకాష్		ఎస్‌పి ఎసిబి
చందోలు మణికంఠ	ఎస్‌ఇడి ఎఎస్‌పి శ్రీకాకుళం	డిజిపి విశాఖ (ఎల్అండ్ఓ)
ఎఎస్ రాణా	ఎఎస్‌పి నర్సీపట్నం	5వబెటాలియన్ కమాండెంట్
కృష్ణకాంత్ పటేల్	ఎఎస్‌పి ఎస్ఇబి కర్నూలు	3వబెటాలియన్ కమాండెంట్
దూడి తుషార్	ఎఎస్‌పి కడప	ఎస్‌పి గుంటూరు
కె.శ్రీనివాసరావు		డిసిపి విజయవాడ
కునుబిల్లి దీరజ్	ఎఎస్‌పి పాడేరు	ఎఎస్‌పి రంపచోడవరం
జగదీష్ అదహల్లి	ఎఎస్‌పి రంపచోడవరం	ఎఎస్‌పి పాడేరు
ఆనంద్ రెడ్డి	డిసిపి విశాఖపట్నం	డిసిపి విజయవాడ
మోకా సత్తిబాబు	డిసిపి విజయవాడ	డిసిపి విశాఖపట్నం

వ్యూహ ప్రతివ్యూహాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ నోటీసు ఇచ్చిన రెండు వారాల్లోనే సమాధానం ఇవ్వాలని స్పీకర్ పట్టుబడుతున్నారని అన్నారు. అదే సమయంలో గంటా శ్రీనివాసరావు ఇచ్చిన రాజీనామాపై మూడున్నరేళ్లు ఆయన ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. తాను క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు చేస్తున్నారని, దానికి సంబంధించి ఆధారాలు బయట పెట్టాలని కోరారు. టిడిపి నుండి వైసిపిలో చేరిన విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ విచారణకు హాజరయ్యారు. టిడిపి విధానాలు నచ్చక తాను వైసిపిలో చేరినట్లు పేర్కొన్నారు. మరో ఎమ్మెల్యే మద్దాలి గిరి విదేశీ పర్యటనలో ఉన్నట్లు తెలిసింది. వల్లభనేని వంశీమోహన్, కరణం బలరాం విచారణకు రాలేదు. అలాగే వైసిపి నుండి జనసేనలో చేరిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ కూడా విచారణకు హాజరయ్యారు.

ఈ దశలో జోక్యం చేసుకోలేం : హైకోర్టు

స్పీకర్ ఛాంబర్‌లో విచారణ ప్రక్రియ జరుగుతుండగానే స్పీకర్ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ వైసిపి రెబల్ ఎంఎల్ఎలు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మండలి ఛైర్మన్ జారీ చేసిన నోటీసులను ఎంఎల్‌సి సి. రామచంద్రయ్య సవాల్ చేశారు. వీటిని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఎంఎల్ఎల తరపు వాదనలు విన్న అనంతరం ఈ దశలో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. నోటీసులకు వివరణ ఇచ్చేందుకు నాలుగు వారాల గడువు కావాలన్న విజ్ఞప్తిని తిరస్కరించింది. అసెంబ్లీ స్పీకర్ విచారణ చర్యలను నిలివేయాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఇళ్ల స్థలాలు.. సాగుభూములకు పట్టాలివ్వండి

- వ్యకాసం ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి కలెక్టరేట్ ముట్టడి
- ఫిబ్రవరి 20లోపు పరిష్కరించకుంటే నిరవధిక దీక్షలు
- వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి జిల్లాలో ఇళ్ల స్థలాలు, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌ను పేదలు ముట్టడించారు. సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఈ ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటలపాటు బైఠాయించి ఆందోళనను చేపట్టారు. అధికారులెవ్వరూ బయటకు రాకపోవడంతో కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేదల వద్దకొచ్చి మాట్లాడారు. సమస్యలను పదిరోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీనికి ముందు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాలసముద్రం సమీపంలో నాసన్, బెల్ పరిశ్రమలకు కారుచౌకగా దళితుల భూములను ప్రభుత్వం లాక్కోవడం దుర్మార్గమన్నారు. ఆర్‌ఆర్ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించి, సరైన నష్టపరిహారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశమిచ్చినా ఉత్తర్వులను అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. పేదల అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డి ఆచరణలో మాత్రం అడుగడుగునా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని విమర్శించారు. పేదల పక్షాన పోరాడాల్సిన టిడిపి, జనసేన పార్టీలు 'రా కదలిరా' అంటూ అధికారం కోసం ఆర్రులు చాస్తున్నాయే తప్ప పేదల గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇలాంటి పార్టీలు వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పదిరోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ వచ్చి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఫిబ్రవరి 20 లోపు సమస్యలు పరిష్కరించకుంటే 21 నుంచి నిరవధిక దీక్షలు చేపడతామని వెంకటేశ్వరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌తో పాటు హిందూపురం, పాలసముద్రం, చిలమత్తూరు, కొడికొండ చెక్‌పోస్ట్ తదితర ప్రాంతాలకు చెందిన పేదలు పాల్గొన్నారు.

షర్మిల...రాష్ట్రానికి నాలుగో కృష్ణుడు

- ఎమ్మెల్యే ఆదిమూలానిది రాజకీయ ఆత్మహత్య
- మీడియాతో మంత్రులు పెద్దిరెడ్డి, ఆర్కే రోజా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాలుగో కృష్ణుడిగా కాంగ్రెస్ పార్టీలోకి వైఎస్ షర్మిల ప్రవేశించారని రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా ఎద్దేవా చేశారు. తిరుపతిలోని ఓ హోటల్లో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ..వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తెగా షర్మిలను అభిమానులు గౌరవిస్తారని, కానీ కుటుంబాన్ని చీల్చిన పార్టీతో, రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌ను అధోగతి పాలుచేసిన కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరడం శోచనీయమన్నారు. తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీతో షర్మిల జతకట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రోజా మాట్లాడుతూ.. చంద్రబాబు కుయుక్తులు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలుసన్నారు. తనకు మళ్లీ ఛాన్స్ కావాలని ప్రజల్లోకి వస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో గతంలో వచ్చిన 23 సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. రాజకీయంగా తనకు అన్ని విధాలా సహకరించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైసిపికి వ్యతిరేకంగా మాట్లాడుతూ తనకు తానే రాజకీయ ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు.


అటవీ కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సిహెచ్ నర్సింగరావు

అటవీ కార్మికులకు న్యాయం చేయాలి

- లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- దీక్షకు సిహెచ్ నర్సింగరావు సంఘీభావం
- జిల్లావ్యాప్తంగా సిఐటియు నిరసనలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జూనియర్లను పర్మినెంట్ చేసి సీనియర్లకు అన్యాయం చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. ఈ తప్పును టిటిడి యాజమాన్యం సరిదిద్దుకోకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. 1160 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న టిటిడి అటవీ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో టిటిడి అటవీ కార్మికులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి పాలన కార్మిక వ్యతిరేకంగా తయారైందని, ధార్మిక సంస్థ టిటిడిలోనూ ఈ ధోరణులు పెరిగిపోయాయని విమర్శించారు. తాజాగా అంగన్‌వాడీల పోరాటాన్ని నిర్వహించిన సిఐటియు దీనికి నాయకత్వం వహిస్తున్న విషయాన్ని టిటిడి యాజమాన్యం గుర్తుంచుకోవాలని అన్నారు. టిటిడి బోర్డులో కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నం జరుగుతోందన్న విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఛైర్మన్ కరుణాకర్ రెడ్డిపై ఉందని, ఇటీవల కొన్ని సమస్యలు పరిష్కరించారని, దీర్ఘకాలంగా పోరాడుతున్న అటవీ కార్మికుల విషయం ఎందుకు పట్టించుకోవడంలేదని, ఈ కుట్రకు పాత్రధారులు, సూత్రధారులు ఎవరనే విషయం వెల్లడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టిముక్కల రఘురామ కృష్ణంరాజు, టిటిడి బోర్డు మాజీ సభ్యులు ఒవి రమణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, బిఆర్‌ఎస్ నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ మద్దతు ప్రకటించారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరాజులు, జిల్లా నేతలు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా నిరసనలు

శ్రీకాళహస్తిలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 2005, 2011లో టిటిడి యాజమాన్యం సూచన మేరకు సొసైటీగా ఏర్పడిన కార్మికులను కాదని, 2013లో చేరిన జూనియర్లను పర్మినెంట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. కెవిబిపురంలో సిఐటియు కార్యాలయం వద్ద, నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద, గూడూరు సబ్‌కలెక్టరేట్ ఎదుట, పుత్తూరులో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించారు.

రజక వృత్తిదారులకు పాలకుల అన్యాయం

- సేవా వృత్తిగా భావించి పథకాలన్నీ వర్తింపజేయాలి
- రజక వృత్తిదార్ల సంఘం రాష్ట్ర సదస్సు డిమాండ్


సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భాస్కరయ్య

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

రజకవృత్తిని సేవా వృత్తిగా భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వృత్తిదారులందరికీ వర్తింపజేయాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భాస్కరయ్య డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్ అధ్యక్షతన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సోమవారం జరిగింది. భాస్కరయ్య మాట్లాడుతూ.. ఇప్పటివరకు పరిపాలించిన ప్రభుత్వాలు రజకుల అభ్యున్నతికి, సంక్షేమానికి పథకాలేమీ అమలు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలకుల విధానాల వల్ల రజక వృత్తిదారులు సామాజికంగా అభివృద్ధి చెందడం లేదని విమర్శించారు. రజక వృత్తిదారులకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం తరహా సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేసి సమర్ధవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదార్లకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని, ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, నిధులను రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేయాలని కోరారు. జిఒ ఎంఎస్ ఆరు ప్రకారం ప్రతి జిల్లాల్లో రజక వెల్ఫేర్ కమిటీ ఏర్పాటు చేసి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించాలని, స్ట్రీట్ వెండర్స్‌కు లేబర్ సర్టిఫికెట్ నిబంధనను రద్దు చేసి వృత్తిదారులకు ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న దోబి పోస్టులను అర్హులైన వారితో భర్తీ చేయాలని, గ్రామాల్లో చెరువులపై పూర్తి హక్కులు రజక వృత్తిదార్లకే ఇవ్వాలని, శాశ్వత గృహ నిర్మాణ పథకం కింద గృహాలు కేటాయించాలని కోరారు.

సదస్సులో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, నాయకులు బి.సుబ్బారావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వృత్తిదారులు పాల్గొన్నారు.

పిఆర్ జెఇ ఆత్మహత్య

- డిఇ కార్యాలయంలో ఘటన
- డిఇ, ఇఇ వేధింపులే కారణమని మృతుడి భార్య ఆరోపణ


రామకృష్ణ (ఫైల్)

ప్రజాశక్తి- రేగిడి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా రాజాంలోని పంచాయతీరాజ్ డిఇ కార్యాలయంలో రేగిడి మండలానికి చెందిన పంచాయతీరాజ్ జెఇ పురుగులు మందు సేవించి అనంతరం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రాజాం ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం... సోమరాజుపేట గ్రామానికి చెందిన వల్లూరు రామకృష్ణ (49) రేగిడి మండల పంచాయతీరాజ్ జెఇగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల రాజాంలో కొత్త ఇల్లు నిర్మించుకొని కుటుంబ సమేతంగా అక్కడే నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం తన ఇద్దరు కుమార్తెలను పాఠశాలకు దిగబెట్టిన అనంతరం రాజాంలోని పంచాయతీరాజ్ డిఇ కార్యాలయానికి వెళ్లారు. డిఇ, ఇతర సిబ్బంది వచ్చేసరికి రామకృష్ణ విగతజీవిగా కనిపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తన భర్త మృతికి పంచాయతీరాజ్ డిఇ, ఇఇ వేధింపులే కారణమని రామకృష్ణ భార్య ఉమా ఆరోపించారు. ఈ మేరకు సిఐ, ఎస్ఐ వద్ద తమ గోడు వినిపించింది. రేగిడి మండలంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల్లో స్థానిక నాయకులకు సిమెంటు బస్తాలను సర్దుబాటు చేసేందుకు నిరాకరించడంతో వేధించారని వాపోయారు. రెండు నెలలుగా జీతం నిలుపుదల చేయడంతో ఎలా బతకాలని తన భర్త ఆవేదన చెందుతుండేవారని తెలిపారు. తన భర్త మృతికి బాధ్యులైన వారిని శిక్షించాలని పోలీసులను ఆమె కోరారు.

సలాసర్ టెక్నోకు పిఎస్‌యుల ఆర్డర్లు

హైదరాబాద్ : తమ సంస్థకు ప్రభుత్వ రంగంలోని రైల్వే, విద్యుత్ రంగాల నుంచి పలు ఆర్డర్లు దక్కాయని ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్స్ సంస్థ సలాసర్ టెక్నో ఇంజనీరింగ్ లిమిటెడ్ తెలిపింది. కొత్త ఆర్డర్ల స్థితిని పంచుకోవడంపై సంతోషంగా ఉందని పేర్కొంది. ఇప్పటి వరకు వివిధ పిఎస్‌యుల నుంచి రూ.731.03 కోట్ల కాంట్రాక్టులను దక్కించుకున్నట్లు వెల్లడించింది. మరిన్ని అదనపు ఒప్పందాలను పూర్తి చేయడానికి ముందస్తు దశలో ఉన్నట్లు పేర్కొంది.

రూ. 5,141.74 కోట్లతో టిటిడి వార్షిక బడ్జెట్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంపు
- టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి


టిటిడి బోర్డు సమావేశంలో పాల్గొన్న ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ, బోర్డు సభ్యులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,141.74 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ఆమోదించినట్లు టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశం నిర్ణయాలను మీడియాకు కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. టిటిడి పోటు విభాగంలోని 70 మంది కాంట్రాక్టు లడ్డూ ట్రే లిఫ్టింగ్ సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులను స్కిల్డ్ కార్మికులుగా మార్పు చేసి వారి వేతనాలను రూ.12,523 నుంచి రూ.15 వేలకు పెంచేందుకు ఆమోదం తెలిపామన్నారు. అన్నదాన విభాగంలో 138 మంది క్లీనర్లు, 79 మంది వంట మనుషులను స్కిల్డ్ కేటగిరీలోకి మార్చి వారి వేతనాలను రూ.17 వేల నుంచి రూ.22 వేలకు, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల్లో పనిచేసే కార్మికులను అన్‌స్కిల్డ్ నుంచి స్కిల్డ్ కేటగిరీలోకి మార్పు చేసి వేతనాలు పెంచామని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర శిల్ప కళాశాలలో వివిధ దేవతామూర్తుల శిల్పాలను తయారుచేస్తున్న శిల్పుల కళానైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా, వారి వేతనాల పెంపుదలకు ఆమోదం తెలిపామన్నారు. కలంకారి కళలో నిపుణులైన మునస్వామిరెడ్డి వేతనం రూ.25 వేల నుండి రూ.39 వేలకు, టిటిడి అనుబంధ, విలీన ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అర్చకులు, సంభావన అర్చకుల వేతనాలను రూ.26 వేల నుంచి రూ.31 వేలకు, టిటిడి స్టోర్‌లో పనిచేసే తొమ్మిది మంది వర్కర్ల వేతనం రూ.తొమ్మిది వేల నుండి రూ.15 వేలకు పెంచినట్లు తెలిపారు. వీరితో పాటు మరికొందరికి వేతనాలు పెంచినట్లు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న 26 స్థానికాలయాలు, విలీనం చేసుకున్న 34 ఆలయాల్లో 227 వేదపారాయణందారు, అధ్యాపక, మేళం సిబ్బంది పోస్టులు, విలీనం చేసుకున్న ఆలయాల్లో 288 అర్చక, పరిచారిక, పోటు వర్కర్, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్, వేదపారాయణందారు, మేళం సిబ్బంది పోస్టుల భర్తీ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి, జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

ఫారెస్టు కార్మికుల సమస్యను పరిష్కరిస్తాం : ఛైర్మన్

తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న ఫారెస్టు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. అటవీ కార్మికుల సమస్యను విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా పైవిధంగా స్పందించారు. టిటిడి ఫారెస్టు కార్మికుల సమస్యను మానవతా దృక్పథంతో ఆలోచిస్తున్నామని, వారి సమస్య పరిష్కారానికి ముగ్గురు టిటిడి ఉన్నతాధికారులతో హైలెవల్ కమిటీని నియమించినట్లు చెప్పారు. మంగళవారం ఫారెస్టు కార్మికులతో, యూనియన్ నాయకులతో సంప్రదించి, వారి డిమాండ్లను కమిటీ సాధ్యాసాధ్యాలను పరిశీలించి న్యాయబద్ధంగా సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు.

ఓలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆదాయంలో 33% వృద్ధి



హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఒజిఎల్) ఆదాయం 33 శాతం పెరిగి రూ.342.4 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ నికర లాభాలు 77 శాతం పెరిగి 27.11 కోట్లుగా నమోదయ్యాయి. బస్సుల సరఫరా సంఖ్య పెరగటంతో మెరుగైన వృద్ధి రేటును సాధించినట్లు ఆ కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకు 1615 విద్యుత్ వాహనాలను డెలివరీ చేయగా 8088 బస్సుల ఆర్డర్‌ను కలిగి ఉన్నట్లు వెల్లడించింది. 2022-23లో తొమ్మిది మాసాల్లో 142 విద్యుత్ బస్సులను సరఫరా చేయగా.. 2023-24లో ఇప్పటి వరకు 178 బస్సులను అందించినట్లు తెలిపింది. సోమవారం జరిగిన బోర్డు సమావేశంలో డైరెక్టర్ల బోర్డు అధికారికంగా ఫలితాలను ఆమోదించించినట్లు ఓలెక్ట్రా తెలిపింది. 2023 డిసెంబరు 31తో ముగిసిన తొమ్మిది నెలలకు కంపెనీ ప్రతి షేరుకు రూ.7.69 ఆదాయాన్ని నమోదు చేసింది. ఇది గత ఏడాది ఇదే సమయానికి రూ.4.70గా ఉంది. 2023-24 తొలి మూడు త్రైమాసికాల్లో ఓలెక్ట్రా ఆదాయం 21 శాతం పెరిగి రూ.865.33 కోట్లుగా చోటు చేసుకుంది. అదే సమయంలో నికర లాభాలు 62 శాతం వృద్ధితో రూ.63.76 కోట్లుగా నమోదయ్యాయి. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికాల్లోని ఆదాయంలో బలమైన వృద్ధిని నివేదించడం మాకు సంతోషంగా ఉంది. మా బస్సుల ఉత్పత్తి సామర్థ్యాన్ని, సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంపై దృష్టి సారిస్తాము. 150 ఎకరాల విస్తీర్ణంలో సీతారాంపూర్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు సాగుతున్నాయి." అని ఒజిఎల్ ఛైర్మన్, ఎండి కెవి ప్రదీప్ తెలిపారు.

బిపిసిఎల్ ఫలితాలు ఆకర్షణీయం

- క్యూ3లో రూ.3,181.42 కోట్ల లాభాలు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ప్రముఖ చమురు కంపెనీ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2023-24 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 82 శాతం వృద్ధితో రూ.3,181.42 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1,747.01 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.1.33 లక్షల కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో రూ.1.33 లక్షల కోట్లుగా నమోదయ్యింది. రెవెన్యూ తగ్గిన లాభాలు పెరగడం విశేషం. గడిచిన అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికంలో సంస్థ వ్యయాలు రూ.1.26 లక్షల కోట్లకు తగ్గాయి. 2022-23 ఇదే క్యూ3లో రూ.1.31 లక్షల కోట్ల ఖర్చులు చూపింది. తాజా ఫలితాలతో మరో త్రైమాసికంలోనూ మెరుగైన ప్రగతిని కనబర్చామని నిరూపణ అయ్యిందని బిపిసిఎల్ ఛైర్మన్, ఎండి జి క్రిష్ణ కుమార్ పేర్కొన్నారు. నిర్వహణలో మరింత ప్రగతి కనబర్చడంతో పాటుగా వృద్ధిలోనూ రాణించడంపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. సోమవారం ఎన్‌ఎస్ఇలో బిపిసిఎల్ షేర్ ధర 3.92 శాతం పెరిగి రూ.493 వద్ద ముగిసింది.

పేదలకు రెన్యూ 2 లక్షల దుప్పట్ల పంపిణీ

హైదరాబాద్ : ప్రముఖ డీకార్బనైజేషన్ సొల్యూషన్స్ కంపెనీ అయిన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ 'గిఫ్ట్ ఆర్మత్' 9వ ఎడిషన్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా 2 లక్షల మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలపింది. సమాజంలోని అట్టడుగు వర్గాలకు చలికాలంలో మద్దతును ఇచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 19,000 దుప్పట్లను పంపిణీ చేసినట్లు పేర్కొంది. ఇప్పటి వరకు తాము 6.25 లక్షల దుప్పట్లను అందించామని.. 2025 నాటికి 10 లక్షల దుప్పట్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ సంస్థకు చెందిన సస్టైనబిలిటీ ఛైర్‌పర్సన్ వైశాలి నిగమ్ సిన్హా పేర్కొన్నారు.

ఎల్ఐసిలో ఐపిఒను ఉపసంహరించుకోవాలి

- ఎల్ఐసి ఎఒఐ విశాఖ డివిజన్ సమావేశంలో మంజునాథ్



మాట్లాడుతున్న ఎల్ఐసి ఎఒఐ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్

ప్రజాశక్తి - కలెక్టరేట్, సీతమ్మధార (విశాఖపట్నం)

ఎల్ఐసిలో ఐపిఒను వెంటనే ఉపసంహరించుకోవాలని, పాలసీలపై జిఎస్‌టిని రద్దు చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ డిమాండ్ చేశారు. విశాఖలోని అంబేద్కర్ భవనంలో సోమవారం ఎల్ఐసి ఎఒఐ విశాఖ డివిజన్ ఐదో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంజునాథ్ మాట్లాడుతూ లాభాల్లో ఉన్న ఎల్ఐసిని ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐపిఒకి అనుమతించిందని విమర్శించారు. ఎల్ఐసి ప్రజల ఆస్తి అని, దీనిని ప్రయివేటుపరం చేసే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఎల్ఐసిలో 32 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారని, వారి ప్రయోజనాలను కాపాడడం కోసం తమ సంఘం పోరాడుతోందని తెలిపారు. ఐఆర్‌డిఎఐ ప్రవేశపెట్టిన పాలసీల వల్ల ఖాతాదారులకు, ఏజెన్సీలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఏజెంట్స్‌కు నష్టం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని తెలిపారు.

వీటికి వ్యతిరేకంగా భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేయనున్నామన్నారు. ఈ సమావేశానికి గౌరవ అతిథులుగా ఎల్ఐసి ఎఒఐ సౌత్ జోన్ ప్రధాన కార్యదర్శి పిఎల్ నర్సింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రవికిషోర్, రాజమండ్రి డివిజన్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐసియుఇ విశాఖ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి వరప్రసాద్ హాజరయ్యారు. సమావేశానికి ముందు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కార్యదర్శి నివేదికపై చర్చించారు. ఈ సమావేశానికి 20 బ్రాంచుల నుంచి 400 ప్రతినిధులు హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో 146 మందితో నూతన కౌన్సిల్‌ను, 72 మందితో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్‌కెఎస్‌వి.కుమార్, అధ్యక్షులుగా ఎం.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవీంద్రనాథ్ ఠాగూర్, ట్రెజరర్‌గా కె.త్రిమూర్తులు ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా ఆంజనేయులు, సత్తార్, ధనుంజయ్, రామకృష్ణ, శ్రీరాములుతో పాటు 23 మందిని ఆఫీస్ బేరర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి

- ఎన్నికల కమిషన్‌కు వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నారాయణ విద్యా సంస్థలు అనధికారికంగా ఓటర్ల వివరాలను సేకరిస్తున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం వైసిపి తరపున ఆ పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నారాయణ విద్యా సంస్థలు ఓటర్ల వివరాలతోపాటు విద్యార్థుల వ్యక్తిగత, సున్నిత సమాచారాన్ని సేకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, ఇతర ప్రొఫెషనల్స్ కాలేజీల్లో చదువుకుంటున్న విద్యార్థుల కుటుంబాల వివరాలను మాజీ మంత్రి, టిడిపి నేత నారాయణ సేకరిస్తున్నారని తెలిపారు. ఇందుకోసం వారి విద్యాసంస్థల్లో పనిచేసే సిబ్బందిని ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు.

ప్రజల వ్యక్తిగత డేటా తీసుకోవటం ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, ఆర్టికల్ 19, 21 ప్రకారం నేరమన్నారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న నారాయణ విద్యా సంస్థలపై, మాజీ మంత్రి పి నారాయణపై చర్యలు తీసుకోవాలని కోరారు.



ఐఐటి కాన్పూర్‌తో సామ్‌సంగ్ ఆర్‌అండ్‌డి ఒప్పందం

గూర్‌గావ్ : కీలక వృద్ధి రంగాలపై దృష్టి పెట్టడానికి ఐదేళ్ల కాలానికి గాను ఐఐటి కాన్పుర్‌తో అవగాహన ఒప్పందం కుదర్చుకున్నట్లు సామ్‌సంగ్ ఆర్‌అండ్‌డి ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. విద్యార్థులు, అధ్యాపకులకు విజువల్, ఆరోగ్యం, విజువల్, ఎఐ, క్లౌడ్ తదితర ఇతర అభివద్ధి చెందుతున్న సాంకేతికతలపై పరిశోధనలో సహకరించుకోవడానికి, నైపుణ్యాలను పెంచుకోవడానికి అవగాహన కుదర్చుకున్నట్లు పేర్కొంది. ఇందుకోసం విద్యార్థులు, అధ్యాపకులకు సహాయం అందించనున్నట్లు తెలిపింది.

టాటా మోటార్స్ నుంచి టర్బోట్రాన్ 2.0 ఇంజిన్

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ కొత్తగా వాణిజ్య ట్రక్కుల కోసం టర్బోట్రాన్ 2.0 ఇంజిన్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇవి అధిక ఇంధన పొదుపు సామర్థ్యం కలిగి ఉంటాయని ఆ సంస్థ పేర్కొంది. 19-42 టన్నుల శ్రేణి ట్రక్కులకు వీటిని ఉపయోగించనున్నట్లు వెల్లడించింది. ఈ ఇంజిన్లను 70వేల గంటల పాటు 30 లక్షల కిలోమీటర్ల మేర పరిశీలిన చేసినట్లు తెలిపింది.



సంపాదకీయం

ఎజెండా సెట్టింగ్...

పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను పునరుద్ధరించే పార్టీలకే ఓటేస్తామని ఉపాధ్యాయ, ఉద్యోగులు ప్రతిన బూనడం స్వాగతించదగింది. మాటలతో మభ్యపెడతామంటే కుదరదు, మేనిఫెస్టోలో చేర్చి, అధికారం చేపట్టగానే తొలి సంతకం పెడతామని ప్రకటించాలని కోరడం మంచిదే. ఒపిఎస్‌పై వైఖరేంటో రాజకీయ పక్షాలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే అసెంబ్లీకి తమ ప్రతినిధులను పంపడానికి సిద్ధపడతామని హెచ్చరించారు కూడా. ఒపిఎస్‌పై ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆదివారం రాజమండ్రిలో భారీ బహిరంగసభ పెట్టుకున్నారు. ఆ సభకు వెళ్లనీకుండా సర్కారు అడ్డుకున్నప్పటికీ వేలాదిగా తరలి రావడం విశేషం. భవిష్యత్ కార్యాచరణ సభాముఖంగా ప్రకటించారు. ఒపిఎస్ కోసం ఇప్పటి వరకు నిర్వహించిన పోరాటాలు ఒక ఎత్తు కాగా ఎన్నికల ముంగిట పార్టీలపై ఒత్తిడి కోసం చేపట్టిన పోరాటాలు మరొక ఎత్తు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి చివరి వరకు కార్యక్రమాల ఎజెండా పార్టీల ముందుంచారు. ఇక తేల్చుకోవాల్సింది పార్టీలే.

కేంద్రంలో 2003లో బిజెపి సర్కారు ఉద్యోగులకు ఒపిఎస్ స్థానంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) చట్టం వచ్చింది. వామపక్షాలు మాత్రమే వ్యతిరేకించగా దాదాపు అన్ని పార్టీలూ సమర్ధించాయి. 2004 జనవరి నుంచి వాజ్‌పేయి ప్రభుత్వం కేంద్రంలో సిపిఎస్ అమలు చేయగా, అదే ఏడాది సెప్టెంబర్ నుంచి ఉమ్మడి ఎ.పి లో వైఎస్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు ప్రారంభించింది. కాలక్రమేణ సిపిఎస్ అన్యాయాన్ని అనుభవ పూర్వకంగా అర్థం చేసుకున్న ఉద్యోగులు ఆ స్కీం రద్దుకు ఉద్యమాలు చేస్తున్నారు. సిపిఎస్ రద్దు కోసం 2019 ఎన్నికలకు ముందు మన రాష్ట్రంలో పెద్ద పోరాటం జరగ్గా టిడిపి ప్రభుత్వం కమిటీ పేరిట మభ్యపెట్టి తక్కువ పింఛన్ ప్రతిపాదించగా తిరస్కరించారు. పాదయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్, తామొస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామన్నారు. ఉద్యోగుల పలు ఆందోళనల అనంతరం, అదీ అధికారంలోకొచ్చిన నాలుగేళ్లకు సిపిఎస్ కుదరదని, ప్రత్యామ్నాయంగా గ్యారంటీడ్ పెన్షన్ స్కీం (జిపిఎస్) అన్నారు. సిపిఎస్, జిపిఎస్ దాదాపు ఒకటే. మరోవైపు మోడీ ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదని పార్లమెంట్‌లో తెగేసి చెప్పింది. ఉపాధ్యాయ, ఉద్యోగులు ఒపిఎస్ కోసం ఉద్యమ బాట పట్టారు. మాయ మాటలతో మోసం చేస్తున్న పార్టీలను నిలదీసేందుకు ఎన్నికలకు ముందు వారు ఎంచుకున్న పోరాట మార్గం సహేతుకమైనది. ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. పార్టీల అసలు రంగు బయట పడుతుంది.

రాష్ట్ర ప్రభుత్వంలో 11 లక్షల మంది వరకు పని చేస్తుండగా ఐదున్నర లక్షల మందే ప్రభుత్వ ఉద్యోగులు. మిగతా సగం కాంట్రాక్టు, ఔట్‌సోర్స్. సర్కారీ కొలువుల్లోని మూడు లక్షల మంది సిపిఎస్ పరిధిలో ఉన్నారు. సిపిఎస్‌కు ఒపిఎస్‌కు మధ్య భారీ తేడా ఉంది. ఒపిఎస్‌లో రిటైరయ్యే సమయానికి ఉద్యోగికి ఉన్న జీతంలో దాదాపు సగం పెన్షన్ వస్తుంది. అదే సిపిఎస్‌లో అయితే ఎంత సీనియర్ ఉద్యోగికైనా గరిష్టంగా వచ్చేది రూ.7 వేలు. పైపెచ్చు సర్వీస్‌లో చనిపోతే ఒపిఎస్‌లో మాదిరి పెన్షన్. రిటైరయ్యాక బతికుంటే నామమాత్రపు పెన్షన్. ఈ అన్యాయంపైనే ఉద్యోగులు ఎలుగెత్తారు. సిపిఎస్, జిపిఎస్ కాదు తమకు ఒపిఎస్ కావాలంటున్నారు. సమాజానికి 30 నుంచి 40 ఏళ్లు సేవ చేసి రిటైరయ్యాక కనీస బతుకు బతికేందుకు ఉద్యోగులకు ఉన్న కనీస భరోసాను తొలగించడం దారుణం. ఉద్యోగుల ఆందోళనలతో పంజాబ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, జార్ఖండ్, హిమాచల్‌లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌కు వెళ్లారు. కేరళ, కర్ణాటక, అసోం, తమిళనాడు, తెలంగాణ ఆ దిశగా కసరత్తు చేస్తున్నాయి. సిపిఎస్ రద్దు హామీ ఇచ్చిన ఇక్కడి ప్రభుత్వం ఆర్థిక సంక్షోభం సాకు వెతికి తన ఉద్యోగ వ్యతిరేకతను చెప్పకనే చెప్పినట్లయింది. ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు. ప్రభుత్వంలో కొన్ని దశాబ్దాలపాటు చేసిన సేవకు ప్రతిఫలం. సామాజిక భద్రత. సుప్రీం కోర్టు ఇదే నొక్కివక్కాణించింది. ప్రభుత్వాలు ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ ప్రభావంతో పెన్షన్‌ను రాజకీయ, ఆర్థిక కోణంలో చూస్తున్నాయి. 'ఒపిఎస్ ఇచ్చే పార్టీలకే ఓటు' ఉద్యమానికి ప్రజలను విస్తృతంగా సమీకరించాలి. పౌర సమాజం ఆ పోరాటానికి మద్దతు తెలపాలి.

మహనీయుల మాట



ఎవరైనా మన లోపాలను ఎత్తి చూపవచ్చు. అవి గనక నిజమైనవయితే ఆ లోపాలను మనం దిద్దుకుంటాం. ఆ సూచన ప్రజలకు ఉపయోగకరమైనది అయితే దాన్ని మనం స్వీకరిస్తాం.
- మావో

నిరుద్యోగపు కొరడా దెబ్బలు

స్వతంత్రం వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేనంత ఘోరంగా నిరుద్యోగం నేడు నెలకొని వుంది. ఈ పరిస్థితి దాపురించడానికి రెండు స్పష్టమైన కారణాలున్నాయి. మొదటిది: కరోనా మహమ్మారి కాలంలో విధించిన లాక్‌డౌన్ సమయంలో తీవ్రంగా ఉత్పత్తి పడిపోయింది. ఉద్యోగాలూ పోయాయి. ఆ తర్వాత కాలంలో ఉత్పత్తి కోలుకుంది కాని ఆ మేరకు ఉద్యోగాలు తిరిగి కల్పించడం జరగలేదు. 2019-20 (కరోనాకి ముందరి ఏడాది)తో పోల్చితే 2023-24లో జిడిపి వృద్ధి 18 శాతం దాకా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాని 2019 నుండీ ఇప్పటిదాకా ఉపాధి కల్పనలో వృద్ధి మాత్రం సున్నా. ఇది సిఎంఐఇ సంస్థ ప్రకటించిన గణాంకాలను బట్టి కనిపిస్తోంది. ఇలా ఎందుకు జరిగింది? కరోనా అనంతర కాలంలో ఉత్పత్తి కోలుకోవడం అనేది భారీ పరిశ్రమల్లో, పెద్ద సంస్థల్లో ఎక్కువగా జరిగింది. వాటితో పోల్చితే చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో వృద్ధి బాగా తక్కువగా జరిగింది. ఉపాధి అవకాశాలు భారీ పరిశ్రమల్లో తక్కువగా ఉంటాయి. అదే చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో అధికంగా ఉంటాయి. ఉపాధిని ఎక్కువగా కల్పించే పరిశ్రమల్లో ఉత్పత్తి అభివృద్ధి తక్కువగా జరగడంతో ఉపాధి అవకాశాల్లో వృద్ధి సున్నా అయిపోయింది.

ఈ పరిస్థితికి మరో కారణం కూడా ఉంది. కరోనా రాకముందే 2019 నాటికే దేశంలో నిరుద్యోగం పరిస్థితి తీవ్రంగా ఉంది. 1973లో చమురు ధరలు ఒక్కసారి పెరగడంతో ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరింది. దాని ఫలితంగా ఆర్థిక మాంద్యం ఏర్పడింది. అది పెద్ద ఎత్తున ఉద్యోగాల కోతకు, వేతనాల కోతకు దారి తీసింది. అప్పటి నిరుద్యోగం పెరుగుదల రేటు కన్నా కూడా 2019లో నిరుద్యోగం పెరుగుదల తీవ్రంగా ఉంది. నిజానికి ఈ నిరుద్యోగం నయా ఉదారవాద విధానాల అమలు వలన అనివార్యంగా వ్యక్తం అయ్యే ధోరణి. దీనికి కరోనా మహమ్మారితో కాని, ఆ తర్వాత కాలంలో కోలుకోవడంతో కాని ఏ సంబంధమూ లేదు. ఇక్కడ కొట్టవచ్చినట్టు మనకు ఒక విషయం కనిపిస్తోంది.



ప్రభాత్ పట్నాయక్

నయా ఉదారవాద విధానాల అమలు మొదలుకాక మునుపు కాలంతో పోల్చితే నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధి రేటు రెట్టింపు అయింది. ఇదే కాలంలో ఉపాధి కల్పన రేటు మాత్రం సగానికి సగం పడిపోయింది.

దేశంలో శ్రామిక వర్గం సంఖ్య పెరుగుదల రేటు కన్నా కూడా ఉపాధి అవకాశాల కల్పన రేటు తక్కువగా ఉంది. ఆర్థిక వ్యవస్థపై నియంత్రణలను తొలగించడంతో ఉపాధిని హరించే సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకుని ఉపాధి అవకాశాలను కుదించడం దీనికి కారణం. దీని వలన ఉత్పాదకత వేగంగా పెరిగింది కాని ఉపాధి అవకాశాలు దెబ్బ తిన్నాయి. మరొకవైపు రైతాంగానికి వ్యవసాయంలో అంతవరకూ ఇస్తున్న మద్దతును, సబ్సిడీలను, రుణాలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీని ఫలితంగా పెద్ద సంఖ్యలో చిన్న రైతులు వ్యవసాయాన్ని మానుకుని పట్టణాలకు వలసలు పోవడం మొదలుబెట్టారు. అది పట్టణాల్లో నిరుద్యోగం మరింత పెరగడానికి దోహదం చేసింది.

నయా ఉదారవాద విధానాలు పెట్టుబడిదారులకు అవధులు లేని స్వేచ్ఛనిస్తాయి. అలా ఇవ్వడం నిరుద్యోగాన్ని పెంచుతుంది. ఇదేవిధంగా జరుగుతుందో పరిశీలిద్దాం.

ఉదాహరణకు ఒకానొక ఆర్థిక వ్యవస్థలో 100 యూనిట్ల ఉత్పత్తిని 100 మంది కార్మికులతో చేయిస్తున్నార నుకుందాం. అటువంటి వ్యవస్థలో ఆ 100 యూనిట్ల ఉత్పత్తినే 50 మంది కార్మికులతోనే చేయించగల కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టారనుకుందాం. అప్పుడు 50 మంది కార్మికుల ఉద్యోగాలు పోతాయి. తక్కిన 50 మందికీ వేతనాలు పాత స్థాయిలోనే కొనసాగుతాయి తప్ప రెట్టింపు కావు కదా. ఐతే వేతనాల కోసం చేసే ఖర్చు సగానికి పడిపోతుంది. అప్పుడు పెట్టుబడిదారుడి లాభాల వాటా పెరుగుతుంది. దాని వలన ఆదాయాలలో అసమానతలు పెరుగుతాయి. వేతనాల వాటా తగ్గి లాభాల వాటా పెరగడం అంటే దాని వలన మార్కెట్‌లో సరుకుల వినియోగం ఆ మేరకు తగ్గిపోతుంది. అంతకు మునుపు 100 మంది ఖర్చు చేయగల స్థితిలో ఉండేవారు. ఇప్పుడు వారు సగానికి తగ్గిపోయారు. అందుచేత మార్కెట్‌లో సరుకులకు డిమాండ్ కూడా ఆ మేరకు తగ్గిపోతుంది. ఉత్పత్తి అయిన సరుకులు మిగిలిపోతాయి. అందుచేత పెట్టుబడిదారుడు తన ఉత్పత్తిని ఆ మేరకు తగ్గించుకుంటాడు. దాని వలన మరి కొన్ని ఉద్యోగాలు పోతాయి.

ఐతే, ప్రముఖ ఆంగ్లేయ ఆర్థికవేత్త డేవిడ్ రికార్డో పెట్టుబడిదారుడి లాభాలు పెరిగాయి గనుక అతడు ఆ లాభాలను మళ్ళీ పెట్టుబడిగా పెడతాడని, దాని వలన అదనంగా ఉద్యోగాలు వస్తాయని భ్రమ పడ్డాడు. అందువల్లనే అతడు కొత్త టెక్నాలజీ ప్రవేశపెట్టడం వలన నిరుద్యోగం పెరగదని భావించాడు. తాత్కాలికంగా టెక్నాలజీ కారణంగా పోయిన ఉద్యోగాలు అదనంగా పెట్టుబడి పెట్టడం వలన మళ్ళీ కల్పించబడతాయని అనుకున్నాడు. అలా లాభాలు పెరుగుతున్న కొద్దీ పెట్టుబడిదారుడు మరింత పెట్టుబడులు పెడుతూనే వుంటాడని, ఆ క్రమంలో టెక్నాలజీ వలన పోయే ఉద్యోగాల కన్నా కొత్తగా వచ్చే ఉద్యోగాలే ఎక్కువగా ఉంటాయని అతడు అనుకున్నాడు. కాని రికార్డో మార్కెట్‌లో సరుకులకు డిమాండ్ విషయంలో తలెత్తే సమస్యను పరిగణనలోకి తీసుకోలేదు. వేతనాల బిల్లు తగ్గుతున్నకొద్దీ కొనుగోలుశక్తి పడిపోయి డిమాండ్ తగ్గుతుంది. అప్పుడు పెట్టుబడిదారుడు తన పెట్టుబడిని తగ్గించుకుంటాడే తప్ప లాభాలు వచ్చాయి గాబట్టి అదనంగా పెట్టుబడి పెడదాం అని అనుకోడు. అందుచేత నిరుద్యోగాన్ని కలిగించే టెక్నాలజీ రానురాను మరింత నిరుద్యోగాన్ని పెంచుతుందే తప్ప తగ్గించదు.

ఎటువంటి నియంత్రణా లేని పెట్టుబడిదారీ వ్యవస్థ నిరంతరాయంగా కొనసాగే భారీ నిరుద్యోగాన్ని తీసుకొస్తుంది. ఒక పరిమిత స్థాయిలో రిజర్వు సైన్యంగా నిరుద్యోగం



ఉన్నంతకాలమూ పెట్టుబడిదారీ వ్యవస్థ దానిని తట్టుకోగలుగుతుంది. టెక్నాలజీ ఆ పరిమిత నిరుద్యోగాన్ని తీవ్ర స్థాయికి తీసుకుపోతుంది. ఇదే సోషలిస్టు వ్యవస్థలోనైతే కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టడం వలన కార్మికుల పని భారం తగ్గుతుంది. వారి వెసులుబాటు సమయం పెరుగుతుంది. అంతే కాదు, వారి వేతనాల బిల్లు ఏమాత్రమూ తగ్గదు. ఇందాకా చెప్పుకున్న ఉదాహరణనే సోషలిస్టు వ్యవస్థలో తీసుకుందాం. అప్పుడు కార్మికులు 100 మందికీ ఉద్యోగాలు యథాతథంగా కొనసాగుతాయి. వారి పని గంటలు మాత్రం కొత్త టెక్నాలజీ కారణంగా సగానికి తగ్గిపోతాయి. ఆధునిక కాలంలో పూర్తి స్థాయిలో ఉపాధి కల్పన సాధించినవి సోవియట్ యూనియన్, తూర్పుయూరప్ దేశాలు మాత్రమే (అక్కడ సోషలిస్టు వ్యవస్థ ఉన్న కాలంలో). అదే కాలంలో పెట్టుబడిదారీ దేశాలన్నీ నిరుద్యోగంతో సతమతమౌతూనే ఉన్నాయి. నయా ఉదారవాద విధానాలు వచ్చాక పెట్టుబడిదారుల మీద ఏ నియంత్రణా లేకపోవడంతో ఆ నిరుద్యోగం భారీ స్థాయికి పెరుగుతోంది. భారతదేశం కూడా 2019 నాటికి ఆ స్థాయికి చేరింది.

ఒక వ్యక్తి నిరుద్యోగిగా ఉండడం అతడి లేదా ఆమె తప్పు కాదు. ఆ వ్యక్తి జీవించే సమాజంలో ఉన్న సామాజిక వ్యవస్థది ఆ తప్పు. ఆ వ్యక్తికి ఉపాధి కల్పించడం ఆ వ్యవస్థకి చేతకాదని నిర్ధారణ అవుతోంది. మరి అటువంటప్పుడు ఉపాధి కల్పన విషయంలో ముందుకు తేవలసిన డిమాండ్ ఎలా ఉండాలి (సోషలిజం కావాలి అని డిమాండ్ పెట్టడం అంటే ఆచరణలో అది నిరుద్యోగ సమస్యకు పరిష్కారాన్ని ప్రస్తుతానికి వాయిదా వేయడమే ఔతుంది.)? సమీప కాలంలో నిరుద్యోగ సమస్య నుండి కొంత ఊరట కలిగించేదిగా, ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలోనే కల్పించగలిగేదిగా ఆ డిమాండ్ ఉండాలి.

బూర్జువా రాజకీయ పార్టీలు సైతం అయిష్టంగానైనా, ఉపాధి కల్పించడం ప్రభుత్వాల బాధ్యతే అని ఒప్పుకోక తప్పడం లేదు. అది వెంటనే సాధ్యం కాదని చెప్తూ ప్రతీ ఒక్కరికీ "కనీస ప్రాథమిక ఆదాయం" కల్పించాలన్న ప్రతిపాదనను అవి ముందుకు తెస్తున్నాయి. ఐతే వాళ్ళు ప్రతిపాదిస్తున్న "కనీస ప్రాథమిక ఆదాయం" (బేసిక్ మినిమమ్ ఇన్‌కమ్) అత్యంత స్వల్పంగా ఉంది. అంతేగాక ఎప్పుడైనా దానిని చెల్లించడానికి నిరాకరించవచ్చు. అది ఒక ఎన్నికల హామీగా ఉండడం చేత కొత్తగా వచ్చే ఏ ప్రభుత్వమైనా దానిని రద్దు చేయవచ్చు. ఈ కనీస ప్రాథమిక ఆదాయం అనేది ప్రభుత్వం దయతో ఇచ్చే భిక్ష కాదు. నిజానికి ఏ నిరుద్యోగీ యాచకుడు కాదు. వారికి ఉద్యోగాలే కావాలి. వాటిని కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో విఫలమైనప్పుడు, ఈ దేశంలో ప్రతీ పౌరుడికీ గౌరవ ప్రదమైన జీవితం గడిపే హక్కు ఉన్నందున, ఒక హక్కుగా కనీస ప్రాథమిక ఆదాయాన్ని వాళ్ళు పొందగలగాలి.

ఉపాధి హక్కు ఒక సార్వత్రికమైన హక్కుగా ఉండాలి. దానికి రాజ్యాంగపరమైన గ్యారంటీ ఉండాలి. రాజకీయ హక్కులు, పౌర హక్కులు ఏవిధంగా ప్రాథమిక హక్కులుగా గ్యారంటీ చేయబడ్డాయో అదే విధంగా ఉపాధి హక్కు కూడా గ్యారంటీ చేయబడాలి.

ఉపాధి హక్కును గ్యారంటీ చేసి కనీస ప్రాథమిక ఆదాయాన్ని అమలు చేయడానికి జిడిపిలో 3 శాతం కన్నా ఎక్కువ ఖర్చు కాదు. ఒక నిరుద్యోగికి కనీసం వేతనంగా నెలకు రూ. 20,000 చొప్పున చెల్లించాలనుకుంటే, ప్రస్తుతం నిరుద్యోగం రేటు 10 శాతం ఉందని లెక్క వేస్తే దేశంలో ఉన్న 4 కోట్లమంది నిరుద్యోగులకూ ఏడాదికి రూ. 9.6 లక్షల కోట్లు అవసరం ఔతుంది. ఇది మన జిడిపిలో 3.2 శాతం.

ఇంతమంది నిరుద్యోగులకు ఈ మొత్తాన్ని అందించడం వలన అది దేశంలో డిమాండ్ భారీగా పెరగడానికి దారి తీస్తుంది. అప్పుడు ఆ మేరకు ఉత్పత్తిని పెంచవలసివస్తుంది. దాని వలన ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అంటే నిరుద్యోగులు తగ్గుతారు. అప్పుడు ప్రభుత్వం తన ఖజానా నుండి చెల్లించవలసిన మొత్తం తగ్గిపోతుంది. అప్పుడు నిరుద్యోగ భృతిగా చెల్లించవలసినది జిడిపిలో 3.2 శాతం కన్నా తగ్గిపోతుంది. ఒక వ్యక్తికి నిరుద్యోగ భృతి నెలకు రూ. 20,000 చొప్పున చెల్లించడం వలన మరొక వ్యక్తికి ఉపాధి కల్పన జరిగిందని అనుకుంటే అప్పుడు ప్రభుత్వం చెల్లించవలసిన నిరుద్యోగ భృతి మొత్తం రూ. 9.6 లక్షల కోట్ల నుండి రూ.4.8 లక్షల కోట్లుకు పడిపోతుంది. అది జిడిపిలో కేవలం 1.6 శాతం మాత్రమే. ఉద్యోగాల కల్పన ద్వారా తక్కినవారికి వచ్చే ఆదాయాల ద్వారా ప్రభుత్వానికి అదనంగా పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది కూడా. అలా పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని కూడా లెక్క వేస్తే అప్పుడు ప్రభుత్వం నిరుద్యోగ భృతి నిమిత్తం చేసే ఖర్చు జిడిపిలో 1.6 శాతం కన్నా కూడా ఇంకా తగ్గిపోతుంది.

ఈ 1.6 శాతం మేరకు ఖర్చు చేయాలంటే దానికి ముందు అదనంగా ఆదాయాన్ని రాబట్టాలి. అందుకోసం అదనపు పన్నులు వేయడం పరిష్కారం. దేశంలోని అత్యంత సంపన్నులుగా ఉన్న 1 శాతం సూపర్ రిచ్ మీద సంపదపన్ను కేవలం 0.8 శాతం మాత్రం విధిస్తే సరిపోతుంది. ఈ పాటి పని కూడా ప్రభుత్వం చేయలేదంటే అది తన బాధ్యత నుండి దూరంగా పారిపోతున్నదన్నమాటే.

(స్వేచ్ఛానుసరణ)


బూర్జువా రాజకీయ పార్టీలు సైతం అయిష్టంగానైనా, ఉపాధి కల్పించడం ప్రభుత్వాల బాధ్యతే అని ఒప్పుకోక తప్పడం లేదు. అది వెంటనే సాధ్యం కాదని చెప్తూ ప్రతీ ఒక్కరికీ "కనీస ప్రాథమిక ఆదాయం" కల్పించాలన్న ప్రతిపాదనను అవి ముందుకు తెస్తున్నాయి. ఐతే వాళ్ళు ప్రతిపాదిస్తున్న "కనీస ప్రాథమిక ఆదాయం" (బేసిక్ మినిమమ్ ఇన్‌కమ్) అత్యంత స్వల్పంగా ఉంది. అంతేగాక ఎప్పుడైనా దానిని చెల్లించడానికి నిరాకరించవచ్చు. అది ఒక ఎన్నికల హామీగా ఉండడం చేత కొత్తగా వచ్చే ఏ ప్రభుత్వమైనా దానిని రద్దు చేయవచ్చు. ఈ కనీస ప్రాథమిక ఆదాయం అనేది ప్రభుత్వం దయతో ఇచ్చే భిక్ష కాదు. నిజానికి ఏ నిరుద్యోగీ యాచకుడు కాదు. వారికి ఉద్యోగాలే కావాలి. వాటిని కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో విఫలమైనప్పుడు, ఈ దేశంలో ప్రతీ పౌరుడికీ గౌరవ ప్రదమైన జీవితం గడిపే హక్కు ఉన్నందున, ఒక హక్కుగా కనీస ప్రాథమిక ఆదాయాన్ని వాళ్ళు పొందగలగాలి.

సందర్భం

లౌకికతత్వం, ప్రజాసామ్య పరిరక్షణే గాంధీజీకి నిజమైన నివాళి

తాను సనాతన హిందువునని, నిత్యం భగవత్ గీత పారాయణం చేస్తానని, దాన్ననుసరించే జీవితాన్ని మలచుకున్నానని ప్రకటించుకున్న జాతిపితను 1948 జనవరి 30న హిందూ మతోన్మాది, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్త నాథూరామ్ గాడ్సే తుపాకితో కాల్చి చంపాడు. గాంధీ హత్య కేసులో ఆధారాలు లేక విడుదలైన సావర్కర్ శిష్యుడే గాడ్సే. మత సామరస్య సాధన కోసం గాంధీజీ చేసిన కృషి, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోసం ఆయన సల్పిన పోరాటం జీర్ణించుకోలేకనే ఆర్.ఎస్.ఎస్ వారు ఈ దారుణానికి పాల్పడ్డారు.

భారతదేశ, ప్రజల నిర్దిష్ట పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి, ఆకళింపు చేసుకున్న స్వాతంత్ర్య ఉద్యమ నేతల్లో మహాత్ముడు అగ్రగణ్యుడు. గాంధీ ఆర్థిక, సనాతన భావాల పట్ల విభిన్న దృక్కోణాలు చరిత్రకారుల్లో ఉన్నప్పటికీ భారతీయులందర్నీ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమ పథంలోకి నడిపిన నాయకుడు గాంధీజీ. తొలినాటి జాతీయోద్యమంలో సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా విజ్ఞప్తులు, రాయబారాల ద్వారా రాయితీలు పొందాలని ఉద్యమిస్తుంటే గ్రామీణ, పట్టణ దిగువ తరగతులను కూడా స్వాతంత్ర్య పోరాటంలోకి నడిపిన నాయకుడాయన. ఆ మహానీయుడ్ని హత్యగావించడానికి సిద్ధాంత పునాది కలిగిన ఆర్‌ఎస్‌ఎస్ సామ్రాజ్యవాదులకు మోకరిల్లింది. గాంధీజీ ఆ ధోరణిని ప్రతిఘటించాడు. ఆ సిద్ధాంత వాదులే దశాబ్ద కాలంగా దేశ రాజకీయ అధికారాన్ని ఏలుతున్నారు. మరోసారి 2024లో అధికారానికై అర్రులు చాస్తున్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బిజెపి గెలుపు ద్వారా తమ మతోన్మాద మనువాద ఎజెండాని పూర్తిగా అమలు జరపాలని ఉవ్విళ్లూరుతున్నారు. భారత ప్రజలు, సంపద సృష్టికర్తలైన కష్టజీవులు ఈ ప్రమాదాన్ని నివారించడానికి ప్రతినబూనాల్సిన సందర్భమిది.



వి.ఉమామహేశ్వరరావు

మతం పట్ల మహాత్ముడి అభిప్రాయం

భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమిదని గాంధీజీ నమ్మాడు. వివిధ మతాలున్న మన దేశం వైవిధ్యాన్ని పరిరక్షించుకొంటూనే ప్రజలందర్నీ భాగస్వాముల్ని చేయాలన్నాడు. మతం పూర్తిగా వ్యక్తిగతమైనదని రాజకీయాల్లో, ప్రభుత్వ విధానాల్లో దానికి పాత్ర ఉండరాదని ప్రవచించడమే కాదు, ఆచరించాడు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 ఆగస్టు 14 రాత్రి గాంధీజీ స్వాతంత్ర్య సంబరాల్లో పాల్గొనలేదు. ఆ రోజు రాత్రి మత కలహాలను ఆపడానికి ప్రయత్నించాడు. అంతకు ముందు దేశ విభజన సందర్భంగా ప్రస్తుత బంగ్లాదేశ్‌లో ఉన్న నౌఖాలిలో హిందూ-ముస్లిం మతోన్మాద అగ్నికీలల్ని నివారించడానికి సత్యాగ్రహం చేపట్టాడు. 1948 జనవరి 12న బిర్లా గృహంలో చేసిన చివరి నిరాహార దీక్ష కూడా మత సామరస్యాన్ని కోరుతూ చేపట్టినదే. మత సామరస్యం పట్ల, లౌకికవాదం పట్ల ఆయన అచంచల విశ్వాసాన్ని తెలియజేస్తుంది. కాని "హిందూస్థాన్ దేశంలో హిందూ జాతి, హిందూ మతం-హిందూ సంస్కృతి, భాషలు తప్ప భిన్నమైన వారందరూ జాతి జీవనం నుండి బహిష్కృతువ్వాలని, భిన్నంగా ఉండేవారంతా దేశ ద్రోహులని" 1939 లోనే ఆర్.ఎస్.ఎస్. అధినేత గోల్వాల్కర్ ప్రకటించాడు. నేటి పాలకులు దానినే ఆచరిస్తున్నారు. మత విద్వేషాల్ని రెచ్చగొట్టడం, జాతులు, భాషలు, సంస్కృతుల మధ్య వైషమ్యాల్ని రెచ్చగొట్టడం చూస్తున్నాం. అనుభవిస్తున్నాం. దీన్ని తీవ్రంగా ప్రతిఘటించాలని గాంధీజీ ఉద్బోధించాడు. దేశ స్వాతంత్ర్యానికి పునాది హిందూ ముస్లిం ఐక్యతని గాంధీజీ చాటాడు. నేడదే శిరోధార్యం.

సామ్రాజ్యవాద వ్యతిరేకత - స్వావలంబన

గాంధీజీ సామ్రాజ్యవాద వ్యతిరేకి. దక్షిణాఫ్రికాలో ఉండగా జాతి వివక్షతకు వ్యతిరేకంగా సత్యాగ్రహం ప్రారంభించాడు. మన దేశంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రజల్ని ఐక్యం చేసి పోరు సల్పాడు. కాని నేటి పాలకులు అమెరికన్ సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లి...స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌ని నిస్సిగ్గుగా బలపరుస్తున్నారు. అమెరికా కనుసన్నల్లో భారత సార్వభౌమాత్వాన్ని నీరుగార్చేలా వివిధ రకాల ఒప్పందాలు చేసుకోవడం, శాంతికి భంగం కలిగించే విన్యాసాల్లో పాల్గొనడం జరుగుతున్నది. స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలు కాంక్షించింది ఇది కాదు. జాతీయ స్వావలంబన, ఆర్థిక స్వయం ప్రతిపత్తి కావాలని బాపూజీ కలలుగన్నాడు. నేడు



నేడు గాంధీ 76వ వర్ధంతి

గాంధీ కలలుగన్న స్వావలంబనను నిర్వీర్యం చేస్తున్నారు. విదేశ పెట్టుబడులు, స్వదేశీ కార్పొరేట్లపై ఆధారపడిన వ్యవస్థను నేటి పాలకులు నిర్మిస్తూ స్వయం ప్రతిపత్తికి తిలోదకాలిచ్చారు. ఈ విధానాల్ని ప్రతిఘటించాల్సిందే.

సామాజిక న్యాయం కోసం...

దేశంలో అణగారిన బడుగు, బలహీన వర్గాలు, స్త్రీల విముక్తి కోసం గాంధీజీ పోరాటం చేశాడు. నాగరికతకు, ఊరికి దూరంగా నెట్టబడిన దళితులు, బలహీన వర్గాలను, హరిజనులను జన జీవన స్రవంతిలోకి తీసుకు రావడానికి సమాజం అంగీకరించేలా హరిజనోద్ధరణ, సహపంక్తి భోజనాలు పెద్ద ఎత్తున జరిపేలా సంస్కరణోద్యమం నడిపాడు. స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండాలని, స్వాతంత్ర్యోద్యమంలో వారూ భాగస్వాములు కావాలని సబర్మతి ఆశ్రమ ద్వారాలను వారికోసం తెరిచాడు. అంతేకాక, దేశ భవితలో వారూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించిన సంస్కరణవాది గాంధీజీ.

ప్రజాస్వామ్య పరిరక్షణ

బలవంతులకు ఎన్ని అవకాశాలుంటాయో అన్ని అవకాశాలు బలహీనులకు కూడా ఇవ్వాల్సిందేనన్నాడు గాంధీజీ. రాజకీయ అధికారం ప్రజల జీవితాల్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపర్చాలని, జాతి జీవనంలో అందరికీ సమ ప్రాధాన్యత ఉండాలని, దేశానికి ప్రజలే అధిపతులుగా వుండాలని తదనుగుణంగా రాజకీయ వ్యవస్థ రూపొందాలన్నాడు. ప్రజల స్వయం ప్రతిపత్తి, పరస్పర సహకారం ఆధారంగా ప్రజాస్వామ్యంలో అభివృద్ధి ఉండాలని ఆకాంక్షించాడు. ఇవే మన రాజ్యాంగంలో పొందుపర్చబడిన అంశాలు. కాని నేటి పాలకులు పటిష్ట నిఘా పర్యవేక్షణలో నిర్మించామని చెబుతున్న పార్లమెంట్ భవనంలో అగంతకుల గలభాపై చర్చించడానికి, ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటుకు సమాధానం చెప్పడానికి ప్రధాని, హోం మంత్రి సంసిద్ధత వ్యక్తం చేయలేదు. పైగా దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిగా... ఈ విషయమై చర్చ జరగాలని కోరిన 146 మంది ప్రతిపక్ష పార్లమెంటు సభ్యుల్ని ఏకపక్షంగా సస్పెండ్ చేశారు.

బ్రిటీష్ వారు ఆనాడు తెచ్చిన రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేశాడు గాంధీజీ. వాక్, సభ, పత్రికా స్వాతంత్ర్యాలు, భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజల హక్కన్నాడు. కానీ నేటి పాలకులు పార్లమెంట్ సభ్యుల్ని సస్పెండ్ చేసి...ప్రతిపక్షాలు లేకుండానే వ్యక్తిగత స్వేచ్ఛను, వాక్‌సభా పత్రికా స్వాతంత్ర్యాలను నిర్వీర్యం చేయడానికి వీలుగా సిఆర్‌పిసి, ఐపిసి, ఎవిడెన్స్ యాక్ట్ లాంటి 18 నిరంకుశ చట్టాలు ఆమోదింపచేసుకున్న తీరు భారత ప్రజాస్వామ్యానికి పట్టిన దుర్గతిని తెలియజేస్తోంది.

గాంధీజీ రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు స్వయం ప్రతిపత్తి, అధికారాలు, నిధులు ఉండేలా గ్రామ స్వరాజ్యం రావాలన్నాడు. కాని రాజ్యాంగంలో ప్రకటించిన రాష్ట్రాల హక్కులపైన, స్థానిక సంస్థల హక్కులు, అధికారాలు, నిధులపైన నేటి పాలకులు దాడి చేస్తూ గణతంత్ర రాజ్యం స్థానే ఏకస్వామ్య పరిపాలన, ఏక పార్టీ-ఏక వ్యక్తి పాలన దిశగా సాగడాన్ని సహిద్దామా? దీన్ని నిలువరించకపోతే ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. నిరంకుశత్వం రాజ్యమేలుతుంది.

నేడు దేశం కార్పొరేట్-మతోన్మాదుల చేతుల్లో చిక్కింది. దేశ పాలకులు దేశ స్వాతంత్ర్యానికి, ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వానికి, సామాజిక న్యాయానికి, ఫెడరలిజానికి, స్వయంప్రతిపత్తికి ప్రమాదం కొనితెచ్చారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా మహాత్ముని ఉత్తేజంతో మరో స్వాతంత్ర్య పోరాటానికి పూనుకోవడమే 76వ వర్ధంతి సందర్భంగా ఆయనకి మనం అర్పించే నిజమైన నివాళి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

సందర్భం

లెప్రసీ నిర్మూలన ఎప్పుడు?

భారత దేశంలో లెప్రసీ వ్యాధి నిర్మూలన కోసం నిరంతరం కృషి చేసినందున గాంధీ వర్ధంతి రోజున (జనవరి 30) లెప్రసీ వ్యాధి వ్యతిరేక అవగాహన దినం జరుపుకుంటున్నాం. ఇది లెప్రసీ వ్యాధి బాధితుల కోసం రూపొందించిన ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం. భారతదేశంలో, కుష్టు వ్యాధి ప్రాబల్యం 10,000 జనాభాకు 0.4 గా ఉంది. నైపుణ్యం కలిగిన వైద్యులు లేకపోవడం వలన ముందస్తుగా వ్యాధిని గుర్తించలేక పోతున్నారు. ప్రతి యేటా 14 ఏళ్ల లోపు చిన్న పిల్లల్లో 6.8 శాతం ఈ వ్యాధి వ్యాపిస్తున్నది. దీనివలన పిల్లలు జీవితాంతం అంగవైకల్యంతో బాధ పడుతున్నారు. ఈ వ్యాధి పిల్లలకు సంక్రమించకుండా, కుష్టు వ్యాధి కలిగిన వారికి వైకల్యం వృద్ధి చెందకుండా నిరోధించడం కోసం కుష్టు వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, మెరుగైన శస్త్ర చికిత్స చేయడం మొదటి ప్రాధాన్యతగా ఉండాలి. అప్పుడే లెప్రసీ వ్యాధి నిర్మూలన కోసం చేస్తున్న కృషి ఫలిస్తుంది. 1983 సంవత్సరంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్‌ఎల్ఇపి) ప్రారంభించినప్పటి నుండి లెప్రసీ వ్యాధి భారాన్ని తగ్గించడానికి కృషి జరుగుతున్నది. జాతీయ ఆరోగ్య విధానం 2002 ప్రకారం జాతీయ స్థాయిలో ప్రతి 10,000 మందిలో ఒక్కరి కంటే తక్కువ మందికి వ్యాధి ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించి అమలు చేయడం జరిగింది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రాబల్యం తగ్గినప్పటికీ, కొత్త కేసులు నిరంతరం పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయం. జాతీయ లెప్రసీ వ్యాధి నిర్మూలన కార్యక్రమం అమలులో భాగంగా సున్నా లెప్రసీ కేసులు, సున్నా లెప్రసీ చైల్డ్ కేసులు, కొత్తగా వచ్చే లెప్రసీ కేసుల్లో సున్నా గ్రేడ్ 2 వైఫల్యాలు, లెప్రసీ వ్యాధి కలిగిన వ్యక్తులపై ఎలాంటి వివక్షత లేకుండా చూడడం వంటివి అమలు చేసి మన దేశంలో 2030 నాటికి లెప్రసీ వ్యాధి రహిత దేశంగా మార్చాలని నిర్ణయించడం జరిగింది. మరి ఆ లక్ష్య సాధన జరిగేనా!

- యం. అడివయ్య,
ఎన్‌పిఆర్‌డి జాతీయ ఉపాధ్యక్షులు.

క్రిమినల్ కేసు ఎదుర్కోవాల్సిందే

- సినీ దర్శకుడు కొరటాల శివకు సుప్రీం స్పష్టం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్థానిక కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం క్రిమినల్ కేసు ఎదుర్కోవాల్సిందేనని శ్రీమంతుడు సినిమా దర్శకుడు కొరటాల శివకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శ్రీమంతుడు సినిమా కథను స్వాతి పత్రికలో ప్రచురించిన కథను కాపీ చేశారని రచయిత శరత్ చంద్ర హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. శరత్ చంద్ర పిటిషన్‌పై విచారణ జరిపి.. దర్శకుడు కొరటాల శివపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దర్శకుడు కొరటాల శివ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కథను కాపీ కొట్టారనేందుకు ఉన్న ఆధారాలను రచయిత శరత్ చంద్ర కోర్టుకు సమర్పించారు. వాటిని నిర్ధారిస్తూ.. రచయితల సంఘం ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ హైకోర్టు, నాంపల్లి కోర్టు ఉత్తర్వులను సమర్థించింది. దీంతో కొరటాల శివ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సినిమా విడుదలైన 8 నెలల తరువాత శరత్ చంద్ర కోర్టును ఆశ్రయించారని, హైకోర్టు, స్థానిక కోర్టు తమ వాదనలను ఎక్కడా పరిగణనలోకి తీసుకోలేదని కొరటాల శివ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. హైకోర్టు రచయితల సంఘం నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుందని, తీర్పులో స్పష్టమైన అంశాలు పొందుపరిచిందని ధర్మాసనం పేర్కొంది. కొరటాల శివ పిటిషన్‌పై తదుపరి విచారణ జరపడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. పిటిషన్ డిస్మిస్ చేస్తామని, లేదా వెనక్కి తీసుకుంటారా? అని నిరంజన్ రెడ్డిని ధర్మాసనం ప్రశ్నించింది. తాము పిటిషన్ వెనక్కి తీసుకుంటామని నిరంజన్ రెడ్డి పేర్కొనగా, అందుకు ధర్మాసనం అనుమతించింది.

వైసిపి పాలనలో
బిసిలు బతకాలంటే భయపడే పరిస్థితులు

- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో బిసిలు బతకాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం బంగారుపెంట గ్రామానికి చెందిన మత్స్యకారుడు చెవిటిపల్లి దుర్గారావు ఆత్మహత్య చేసుకున్నాడని, ఇతని మరణానికి జగన్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి మద్యం తీసుకొస్తున్నాడని అక్రమ కేసు పెట్టారని, అనంతరం వైసిపిలో చేరుతావా? చేరవా? అంటూ బెదిరించారని అన్నారు. పోలీసులు బెదిరింపుల వల్లే మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. పల్నాడు జిల్లాలో చంద్రయ్య టిడిపిలో బ్రహ్మానందరెడ్డికి తోడుగా ఉన్నాడని అతనిపై వేధింపులకు దిగారన్నారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన మత్స్యకార మహిళ పద్మ వైసిపిలో చేరలేదని వివస్త్రను చేసి వేధించారన్నారు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుందన్నారు. అలాగే విజయవాడకు చెందిన బొందల అనే బిసి సామాజిక తరగతికి చెందిన రాంసింగ్ అనే ఆర్‌టిసి బస్సు డ్రైవర్ హారన్ కొట్టాడని నడి రోడ్డుపై దారుణంగా చితక బాదారని గుర్తు చేశారు. రేపల్లెలో పదోతరగతి చదివే బిసికి చెందిన అమర్‌నాథ్‌గౌడ్ అనే యువకుడు తన అక్కను వేధించవద్దని చెప్పినందుకు పెట్రోల్ పోసి తగులబెట్టారన్నారు. విజయనగరం జిల్లాలో కృష్ణ అనే ఉపాధ్యాయుడును దారుణంగా హత్య చేశారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. బిసి కార్పొరేషన్ నుంచి ఒక్కపైసా సహాయం చేయలేదని, బిసిలకు హక్కుగా రావాల్సిన పథకాల్ని అణగదొక్కారని విమర్శించారు.

వైసిపి సభలకేనా బస్సులు: ఆర్‌టిసి ఎమ్‌డికి వర్ల రామయ్య లేఖ

వైసిపి రాజకీయ సభలకు బస్సులు పంపుతున్న ఆర్‌టిసి యాజమాన్యం, టిడిపి సభలకు ఆర్‌టిసి బస్సులు అద్దెకు ఇవ్వకపోవడానికి కారణాలేంటని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఆయన లేఖ రాశారు. భీమునిపట్నంలో జరిగిన వైసిపి సభకు ఎన్ని బస్సులు పంపారు? పంపిన బస్సులకు చెల్లింపులు ఏ లెక్కన ఛార్జ్ చేశారు? ఆర్‌టిసి నిర్ణయించిన రేట్ల ప్రకారం వైసిపి అద్దెను చెల్లించిందా? చెల్లిస్తే ఏ విధానంలో (మోడ్ ఆఫ్ పేమెంట్) ఎంత, ఎవరి పేరు మీద చెల్లించారో వంటి వివరాలు వెల్లడించాలని వర్ల రామయ్య లేఖలో కోరారు.

ఢిల్లీ విమానాశ్రయంలో రన్ వేపైకొచ్చిన వ్యక్తి

న్యూఢిల్లీ : రిపబ్లిక్ డే రోజున ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన భద్రతా వైఫల్యం తాజాగా వెలుగుచూసింది. మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి రక్షణ గోడ దూకి రన్‌వేపైకి దూసుకొచ్చాడు. ఈ విమానాశ్రయ భద్రతను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) పర్యవేక్షిస్తోంది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. రన్‌వేపైకి దూసుకొచ్చిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్టు అధికారులు గుర్తించారు..

లెక్క తేలని రూ.91,253 కోట్లు

ఆర్థిక అవకతవకలపై కాగ్ విచారణ చేపట్టాలి
నాదెండ్ల మనోహర్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన అప్పుల్లో రూ.91,253.29 కోట్లకు లెక్కలు తేలడం లేదని, తీసుకొచ్చిన అప్పును ఎందుకు, ఎప్పుడు ఖర్చు పెట్టారో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. లెక్కలు తేలని అప్పులపై కాగ్ జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విజయవాడ బందరు రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన పక్కన ఉన్న మరో కుర్చీలో ఆయన సిఎం జగన్ ఫ్లెక్సీని పెట్టారు. మీడియా సమావేశాలను జగన్ నిర్వహించడం లేదని, విలేకరుల ప్రశ్నలను తీసుకోవడం లేదని, అందుకు నిరసనగా మీడియా సమావేశంలో జగన్ ఫ్లెక్సీని పెట్టినట్లు ఆయన వివరించారు. 'మీడియా సమావేశం నిర్వహించలేని జగన్ దేనికి సిద్ధం' అని ఆయన ప్రశ్నించారు. ఈ మొత్తానికి లెక్క చెప్పేందుకు రివర్స్ బారోయింగ్ అనే పదాన్ని జగన్ ప్రభుత్వం సృష్టిస్తోందన్నారు. అప్పుల రూపేణా తెచ్చిన నగదు ఎటు పోయిందో అర్థంకాక, బడ్జెట్‌లో ఎలా లెక్కలు చూపాలో అర్థం కాక అధికారులలో ఆందోళన మొదలైందన్నారు. వైసిపి చేతగాని పాలనలో ఏషియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్, బ్రిక్స్ బ్యాంక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాయన్నారు. రాష్ట్ర పరువును అంతర్జాతీయ స్థాయిలో జగన్ ప్రభుత్వం తీసిందన్నారు. ప్రాంతీయ సదస్సులంటే ఆయా ప్రాంతీయ సంస్కృతులను ప్రతిబింబించేలా కళాకారుల ప్రదర్శనలు చేస్తారని, వైసిపి మాత్రం భీమిలిలో నిర్వహించిన సభలో విపక్ష నాయకుల బొమ్మలను ఏర్పాటు చేసి వాటికి పంచ్ బ్యాగులను ఏర్పాటు చేశారన్నారు. కార్యకర్తలతో వాటిని కొట్టిస్తూ విద్వేషం నింపే ప్రయత్నం చేశారన్నారు. ఇలాంటి విద్వేషపు పనులను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

తాడేపల్లికి వైసిపి నేతల క్యూ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు వైసిపి అధిష్టానం పిలుపు మేరకు పలువురు నేతలు, ఎమ్మెల్యేలు సోమవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి క్యూ కట్టారు. పార్లమెంటు, అసెంబ్లీలకు పోటీ చేసే అభ్యర్థుల కసరత్తు కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, విశాఖ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరి శంకర్రావు, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌రావు క్యాంపు కార్యాలయంలో సజ్జల రామకృష్ణారెడ్డి, సిఎం ముఖ్యకార్యదర్శి ధనంజయరెడ్డితో భేటీ అయ్యారు. అలాగే విజయవాడ ఎంపి కేశినేని నాని, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వచ్చి వైసిపి పెద్దలతో భేటీ అయ్యారు.

విద్యాశాఖ శకటానికి తృతీయ బహుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఢిల్లీలో నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుక పరేడ్‌లో రాష్ట్ర విద్యాశాఖ శకటానికి తృతీయ బహుమతి వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. డిజిటల్ క్లాస్‌రూమ్ థీమ్‌తో ఈ శకటం రూపొందించిందని తెలిపింది. కర్తవ్యపథ్‌లో వికసిత్ భారత్ టీమ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలకు అద్దంపట్టేలా తీర్చిదిద్దిన శకటం పలువురిని ఆకట్టుకుందని వెల్లడించింది. దేశంలోని 28 రాష్ట్రాల్లోని శకటాలు పరేడ్‌లో పాల్గొనగా పీపుల్స్ ఛాయిస్ విభాగంలో ఈ విద్యాశాఖ శకటానికి అవార్డు లభించినట్లు తెలిపింది.

రాష్ట్రంలో అధికార మార్పును కోరుకుంటున్న ప్రజలు

- పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజలు అధికార మార్పును కోరుకుంటున్నారని, వైసిపి ప్రభుత్వం సంక్షేమం పేరుతో ఓటు రాజకీయాలు నడుపుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా ఇన్‌ఛార్జులతో రానున్న ఎన్నికల సన్నద్ధతపై సోమవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లగలిగే నాయకత్వాన్ని ఆశిస్తున్నారన్నారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గారపాటి సీతారామాంజనేయచౌదరి, బిట్రా శివన్నారాయణ వేరుగా మీడియాతో మాట్లాడుతూ.. 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఫిబ్రవరి 1న కార్యాలయాలు ప్రారంభిస్తామన్నారు.

ఇడి, సిబిఐలను పంపి ప్రజలను భయపెట్టాలని చూస్తోంది

- కేంద్రంపై మమత విమర్శలు

కూచ్ బెహార్ (పశ్చిమ బెంగాల్) : ప్రజల ఇళ్లల్లోకి ఇడి, సిబిఐలను పంపి ప్రజలను భయపెట్టాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. సిఎఎ నుంచి ప్రజలు తమను తాము రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉండేలా చూసుకోవాలని కూచ్ బెహార్‌లోని ప్రజలకు మమత విజ్ఞప్తి చేశారు. ఇక్కడ ఒక ప్రజా పంపిణీ కార్యక్రమంలో మమత ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయాలు చేసేందుకే సిఎఎ అంశాన్ని మళ్లీ కేంద్రం తెరపైకి తీసుకొస్తోందని అన్నారు.

వారం రోజుల్లో సిఎఎ అమలు

- 'గ్యారంటీ' ఇచ్చిన కేంద్ర మంత్రి శంతను ఠాకూర్

కొల్‌కతా : పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) వారం రోజుల్లో దేశవ్యాప్తంగా అమలు చేస్తామని కేంద్ర షిప్పింగ్, పోర్ట్స్, వాటర్‌వేస్ శాఖ మంత్రి శంతను ఠాకూర్ 'గ్యారంటీ' ఇచ్చారు. ఈ చట్టం 2019లో పార్లమెంట్ ఆమోదం పొందిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణాల జిల్లా కాక్‌ద్వీప్‌లో ఠాకూర్ విలేకరులతో మాట్లాడుతూ 'అయోధ్యలో రామ మందిరం ప్రారంభమైంది. ఇప్పుడు నేను మీకు గ్యారంటీ ఇవ్వగలను. రాబోయే ఏడు రోజుల్లో బెంగాల్‌లో మాత్రమే కాదు... దేశమంతటా సిఎఎను అమలు చేస్తాం. ఈ చట్టాన్ని ప్రతి రాష్ట్రంలోనూ అమలు చేస్తాం' అని చెప్పారు. గత ఏడాది నవంబర్‌లో హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా '2024 మార్చి నుంచి సిఎఎ అమల్లోకి వస్తుంది' అని ప్రకటించిన సంగతి తెలిసిందే. 2019 డిసెంబరులోనే సిఎఎను పార్లమెంట్ ఆమోదించింది. ఈ చట్టం కోసం నిబంధనలు రూపొందించడంలో బిజెపి ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఎన్నికల నేపథ్యంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు ఆ పార్టీ నాయకులు మాత్రం త్వరలో సిఎఎ అమల్లోకి రానుందని చెబుతున్నారు.

బీహార్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్ర

- నేడు భారీ ర్యాలీ, మహాకూటమి నాయకుల హాజరు



కిషన్‌గంజ్ : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర సోమవారం బీహార్‌లో ప్రవేశించింది. ఉదయం 8 గంటలకు పశ్చిమబెంగాల్‌లోని సోనాపూర్ నుండి ప్రారంభమైన యాత్ర ఉదయం 11 గంటలకు బీహార్ సరిహద్దులోని కిషన్‌గంజ్ చేరుకుంది. ఈ సందర్భంగా కిషన్‌గంజ్ జిల్లాల్లో జరిగిన ర్యాలీల్లో రాహుల్ మాట్లాడుతూ బిజెపి, ప్రధాని మోడీపై విమర్శలు ఎక్కుపెట్టారు. నితీష్‌కుమార్ ఇండియా వేదిక నుంచి బయటకు వెళ్లడంపై రాహుల్ స్పందించలేదు. మోడీ ప్రభుత్వానిది 'విద్వేష భావజాలం' అయితే, తమది ప్రేమ అనే భావజాలం అని అన్నారు. కొంతమంది ఎంపిక చేసిన బిలియనీర్లకు దేశంలో ప్రజలందరి డబ్బును మోడీ ప్రభుత్వం దోచిపెడుతుందని విమర్శించారు. కేంద్రంలో 90 మంది ఐఎఎస్ అధికారులు ఉంటే వారిలో ముగ్గురు మాత్రమే ఒబిసిలని అన్నారు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న ఒబిసిలకు ఉద్యోగ, విద్యా అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన దేశానికి ఎక్స్‌రే లాంటిదని, అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన నిర్వహిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. దేశంలో పేదలు అన్యాయానికి గురవుతున్నారని, వారికోసమే ఈ యాత్ర అని చెప్పారు. మంగళవారం బీహార్‌లో కాంగ్రెస్ పార్టీ ర్యాలీని నిర్వహించనుంది. ఈ ర్యాలీలో మహాకూటమికి చెందిన నాయకులు హాజరుకానున్నారు.

ఆ సిఎంల సర్టిఫికెట్ అవసరం లేదు : కాంగ్రెస్

అసోం, బీహార్ ముఖ్యమంత్రుల నుండి తమ పార్టీకి సర్టిఫికెట్ అవసరం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. ఢిల్లీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'భారత్ జోడో న్యాయ్ యాత్రకు అసోం ముఖ్యమంత్రి నుండి చాలా ప్రచారం లభించింది. నితీష్ కుమార్ నమ్మకద్రోహం తర్వాత బీహార్‌లోని కిషన్‌గంజ్ ప్రజలు రాహుల్ యాత్రకు ఎంతో ఉత్సాహంతో స్వాగతం పలికారు. అసోం సిఎం నుండి, బీహార్ సిఎం నుండి మాకు సర్టిఫికెట్ అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు.

గణనీయమైన తేడాలున్నాయి

- కాల్పుల విరమణ చర్చలపై ఇజ్రాయిల్ వ్యాఖ్యలు
- ఈ వారం కూడా కొనసాగుతాయంటూ వెల్లడి

రఫా : ఆదివారం అమెరికా, కతార్, ఈజిప్ట్‌లతో కాల్పుల విరమణపై చర్చలు జరిగిన తర్వాత ఇంకా గణనీయమైన అంతరాలు వున్నాయని ఇజ్రాయిల్ తెలిపింది. అయితే చర్చలు నిర్మాణాత్మకంగానే జరిగాయని వ్యాఖ్యానించింది. ఈ వారంలో కూడా చర్చలు కొనసాగుతాయని పేర్కొంది. ఈ మేరకు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం నుండి ఒక ప్రకటన వెలువడింది. అయితే ఆ గణనీయమైన అంతరాలు ఏమిటనే వివరాలను ఆ ప్రకటన వెల్లడించలేదు. ఇతర పక్షాల నుండీ ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ నేపథ్యంలో మిగిలిన బందీలను కూడా విడుదల చేస్తే అందుకు ప్రతిగా హమాస్‌పై సైనిక చర్యను ఇజ్రాయిల్ ఆపడానికి ఒప్పందం కుదిరే అవకాశాల దిశగా పురోగతి వుండవచ్చని భావిస్తున్నారు. ఇప్పటివరకు ఇజ్రాయిల్ జరిపిన సైనిక చర్యలో 26,422 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఆదివారం జరిగిన కాల్పుల విరమణ చర్చల్లో సిఐఎ డైరెక్టర్ బిల్ బర్న్స్, మొసాద్ అధిపతి డేవిడ్ బర్నియా, కతార్ ప్రధాని మహ్మద్ బిన్ అబ్దుల్‌రహమాన్ అల్ థాని, ఈజిప్ట్ ఇంటెలిజెన్స్ చీఫ్ అబ్బాస్ కామెల్ పాల్గొన్నారు. సమావేశానంతరం బైడెన్ ప్రభుత్వ సీనియర్ అధికారులు ఇరువురు మాట్లాడుతూ, కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశాలు వున్నాయని, ఇది రెండు దశల్లో అమలు కావచ్చని, మొదటి దశలో 30రోజుల విరమణలో భాగంగా మహిళలు, వృద్ధులు, గాయపడిన బందీలను విడుదలవుతారని తెలిపారు.

తక్షణమే నిధులు అందించాలి

గాజాలోని ప్రజలకు మానవతా సాయమందించేందుకు తక్షణమే పాలస్తీనా శరణార్ధుల సంస్థకు నిధులను అందించాల్సిందిగా అమెరికా ఇతర దేశాలను ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి చివరికల్లా గాజాలో తమ మద్దతును అందించే కార్యకలాపాలను నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తుతోందంటూ పాలస్తీనా శరణార్ధుల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జూలియట్ టోమా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గుటెరస్ విజ్ఞప్తి వెలువడింది.

దాడికి మాదే బాధ్యతన్న ఇరాక్ గ్రూపు

జోర్డాన్-సిరియా సరిహద్దుల్లో గల అమెరికా స్థావరంపై జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు అమెరికన్ సైనికులు మృతి చెందగా, 34మంది గాయపడ్డారు. ఈ దాడికి తమదే బాధ్యత అంటూ ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఇన్ ఇరాక్ అనే గ్రూపు ప్రకటించింది. కాగాఈ దాడితో తమకెలాంటి సంబంధం లేదని ఇరాన్ ప్రకటించింది.

ముగ్గురు పౌరులు మృతి

మరోవైపు దక్షిణ గాజాలో ప్రజలతో ప్రమాదకరంగా కిక్కిరిసిపోయిన రఫా నగరంలోకి మరింత మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలవంతంగా నెట్టివేస్తోంది. ఖాన్ యూనిస్ నగరంపై దాడులతో ఈ పరిస్థితి మరింత భయంకరంగా మారుతోంది. ఈ నగరంలోని అల్ అమల్ ఆస్పత్రికి సమీపంలో ముగ్గురు పౌరులను ఇజ్రాయిల్ బలగాలు కాల్చి చంపాయి. వరుసగా 8 రోజులుగా నాజర్, అ ల్ అమల్ ఆస్పత్రులను ఇజ్రాయిల్ సైన్యం చుట్టుముట్టి దాడులు చేస్తోంది.

మీతో మీరే పోటీపడండి : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : విద్యార్థులు ఇతరులను పోటీగా భావించకుండా .. తమకు తామే పోటీగా భావించాలని ప్రధాని మోడీ పేర్కొన్నారు. సోమవారం 'పరీక్షా పే చర్చ' ఏడో ఎడిషన్ సందర్భంగా ప్రధాని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులే భారతదేశ భవిష్యత్తు రూపకర్తలుగా అభివర్ణించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత విస్తృతమవుతుండడంతో .. ఈ కార్యక్రమం తనకు కూడా పరీక్షలాగా మారిందని అన్నారు. పోటీ, సవాళ్లు జీవితంలో స్ఫూర్తినిస్తాయని.. అయితే పోటీ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మీ పిల్లలను మరొకరితో పోల్చకూడదని, అది వారి భవిష్యత్తుకు హాని కలిగించవచ్చని అన్నారు. కొందరు తమ పిల్లల రిపోర్ట్ కార్డులను విజిటింగ్ కార్డుగా పరిగణిస్తారని, ఇది మంచిది కాదని అన్నారు. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి మూడు రకాలుగా ఉంటుందని ప్రధాని వివరించారు. సహ విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఎదురైతే.. ఒక్కోసారి పిల్లలు తాము రాణించలేకపోతున్నామని ఒత్తిడిగా ఫీలవుతారని అన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ప్రిపరేషన్ సమయంలో చిన్నచిన్న లక్ష్యాలను ఏర్పరుచుకుని, క్రమంగా మీ పనితీరును మెరుగుపరుచుకోవాలని, దీంతో మీరు పరీక్షలకు సిద్ధమవ్వచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నుండి ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయురాలితోపాటు కళా ఉత్సవ్ విజేతలు హాజరయ్యారు.

సస్పెండ్ చేస్తే నాకేంటి?

- జాతీయ క్రీడలు నిర్వహిస్తున్న రెజ్లింగ్ సమాఖ్య
- దానిపై ఎప్పుడో వేటు వేసిన క్రీడా శాఖ
- అయినా ... మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న సంజయ్ సింగ్



న్యూఢిల్లీ : దేశంలోని మల్లయోధులు అయోమయం, గందరగోళంలో పడిపోయారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ విధేయుడైన సంజయ్ సింగ్ నేతృత్వంలోని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)పై సస్పెన్షన్ వేటు పడినప్పటికీ పూనేలో సీనియర్ జాతీయ పోటీలు నిర్వహిస్తుండడం ఈ పరిస్థితికి కారణమైంది. అయితే ప్రముఖ క్రీడాకారుల్లో చాలా మంది ఈ పోటీల్లో పాల్గొనడం లేదు. కేంద్ర క్రీడా మంత్రి ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీ వచ్చే నెల ప్రారంభంలో జైపూర్‌లో నిర్వహిస్తున్న 'నేషనల్స్'కు వారంతా హాజరవుతున్నారు.

బ్రిజ్ భూషణ్‌పై కనీసం ఏడుగురు మహిళా మల్లయోధులు లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అయితే పోలీసులు ఆయనపై ఎలాంటి చర్య తీసుకోలేదు. బ్రిజ్ భూషణ్ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగుతూనే ఉన్నారు. దేశంలోని ప్రముఖ రెజ్లర్లు సుదీర్ఘకాలం నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ఆయన్ని డబ్ల్యూఎఫ్‌ఐ అధ్యక్ష పదవి నుండి తప్పించారు. బ్రిజ్ భూషణ్ విధేయుడైన సంజయ్ సింగ్ ఆ పదవికి ఎన్నికవడంతో రెజ్లర్లు మరోసారి ఆందోళన బాట పట్టారు. దీంతో రెజ్లింగ్ సమాఖ్యపై క్రీడా మంత్రిత్వ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. సమాఖ్య కార్యకలాపాల పర్యవేక్షణకు అడ్‌హాక్ కమిటీని నియమించింది. అయితే తనపై విధించిన సస్పెన్షన్‌ను గుర్తించబోనని సంజయ్ సింగ్ తెగేసి చెబుతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అంతటితో ఊరుకోని సంజయ్ సింగ్ పూనేలో సోమవారం నుండి సీనియర్ నేషనల్స్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇవి బుధవారం వరకూ కొనసాగుతాయి. అయితే పోటీలు నిర్వహించే వేదిక వద్ద దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రెజ్లింగ్ కేటగిరీల్లో పేరెన్నికగన్న క్రీడాకారులు చాలా మంది అక్కడ కన్పించడం లేదు. గత సంవత్సరం జూలైలో ఆసియా క్రీడల ట్రయల్స్‌లో రవి దహియాను ఓడించిన మహారాష్ట్ర మల్లయోధుడు అతిష్ తోడ్కర్ ఒక్కడే అక్కడ కన్పించాడు. రైల్వే, సర్వీసెస్ జట్లు రంగంలో లేకపోవడంతో పోటీలు కళ తప్పాయి. సంజయ్ సింగ్‌కు మద్దతుగా 24 రాష్ట్రాలలోని రెజ్లింగ్ సమాఖ్యల నుండి మల్లయోధులను పంపేందుకు కొన్ని వర్గాలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అసోం మినహా అనేక రాష్ట్రాల నుండి పూర్తి స్థాయి జట్లు జైపూర్ వెళుతున్నాయి. అక్కడ జరిగే నేషనల్స్‌లో పాల్గొంటాయి. వారం రోజుల వ్యవధిలో రెండు పోటీలు జరుగుతుండడంతో మల్లయోధులు అయోమయంలో పడిపోయారు. కొందరు రెండు పోటీలలోనూ పాల్గొంటున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో రెండు పోటీల్లో పాల్గొనడం మల్లయోధులకు అంత తేలికైన విషయం కాదు.

మళ్లీ ఉద్యోగాల్లోకి తీసుకోవాలంటూ
ఢిల్లీలో సివిల్ డిఫెన్స్ వాలంటీర్ల నిరసన

న్యూఢిల్లీ : తమను మళ్లీ ఉద్యోగాల్లోకి తీసుకోవాలంటూ ఢిల్లీలో సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు నిరసనకు దిగారు. సెంట్రల్ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. సివిల్ డిఫెన్స్ వాలంటీర్ల సేవలను రద్దు చేయాలనే ఆప్ ప్రభుత్వ ప్రతిపాదనకు గత ఏడాది అక్టోబర్‌లో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సెనా ఆమోదం తెలిపారు. గత ఏడాది నవంబర్ 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. మూడో రోజుల్లోగా మమల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్లు సోమవారం నిరసనలో డిమాండ్ చేశారు. లేకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాల ముందు నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. వాలంటీర్ల నిరసన సందర్భంగా ఆప్ కార్యాలయం వద్ద పారామిలటరీ, పోలీసులతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పౌర రక్షణ చట్టం 1968 ప్రకారం గతంలో సివిల్ డిఫెన్స్ వాలంటీర్ల ఉద్యోగాలను కల్పించారు. వ్యక్తులు, ఆస్తులు, ప్రదేశాలపై శత్రువులు దాడులు చేయకుండా వీరు రక్షణ కల్పిస్తారు. స్థానిక పరిపాలనకు సహాయం చేయడమే వీరి విధి. ఢిల్లీలో వీరిని బస్ మార్షల్స్‌గానూ నియమించారు. ప్రభుత్వ పథకాలను విరివిగా ప్రచారం చేయడం కూడా చేశారు.

సిమిపై నిషేధం మరో ఐదేళ్లు పొడిగింపు

న్యూఢిల్లీ: స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)పై నిషేధాన్ని మరో ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (యుఎపిఎ) కింద సిమిపై నిషేధాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. 'భారత్ సార్వభౌమాధికారం, భద్రత, సమగ్రతను బెదిరించేలా, శాంతి-మత సామరస్యానికి భంగం కలిగించడంలో సిమి నిమగ్నమైందని పేర్కొంది. సిమిపై 2014 ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం తొలిసారి నిషేధం విధించింది. 2019లో ఈ నిషేధాన్ని ఐదేళ్లపాటు పొడిగించింది. 1977 ఏప్రిల్‌లో ఉత్తరప్రదేశ్ అలీగఢ్‌లోని ముస్లిం యూనివర్సిటీ ప్రొఫెసర్ మహ్మద్ అహ్మదుల్లా సిద్ధిఖీ సిమిని స్థాపించారు. ప్రారంభంలో, విద్యార్థుల క్రియాశీలతపై ఈ సంస్థ దష్టి సారించింది. దేశంలో ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించింది. భారతదేశాన్ని ఇస్లామిక్‌గా మార్చే ఎజెండాలో సిమి పని చేస్తోందని ఆరోపిస్తూ 2001లో తొలిసారిగా చట్టవిరుద్ధ సంస్థగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

గత ఏడాది 14 లక్షల మంది భారతీయులకు యుఎస్ వీసాలు

న్యూఢిల్లీ: గత ఏడాది సుమారు 14 లక్షల మంది భారతీయులకు అమెరికా వీసాలను జారీ చేసింది. గతంలో ఎన్నడూ ఇంత భారీ స్థాయిలో వీసాలను ఇవ్వలేదు. భారత్‌లో ఉన్న అమెరికా కౌన్సులర్ బృందం ఈ వీసాలను జారీ చేసింది. దీంతో వీసా అపాంట్‌మెంట్ కోసం ఎదురుచూసే సమయం 75 శాతం తగ్గిపోయినట్లు యుఎస్ ఎంబసీ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పది మంది అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే, వారిలో ఒకరు భారతీయుడు ఉన్నట్లు అమెరికా ఎంబసీ తెలిపింది. అన్ని రకాల వీసాలకు డిమాండ్ పెరిగినట్లు కౌన్సులేట్ పేర్కొన్నది. 2022తో పోలిస్తే 2023లో దరఖాస్తుల సంఖ్య 60 శాతం పెరిగినట్లు అమెరికా ఎంబసీ తెలిపింది. బి1/బి2 వీసాలను రికార్డు స్థాయిలో ఏడు లక్షల వరకు జారీ చేసినట్లు కౌన్సులేట్ ప్రకటించింది. వీసా ప్రాసెసింగ్ కోసం నిరీక్షణ సమయాన్ని వెయ్యి రోజుల నుంచి 250 వరకు కుదించినట్లు పేర్కొంది.

మధుర కేసులో సర్వేపై స్టే పొడిగింపు

న్యూఢిల్లీ: మధురలో కృష్ణుడు ఆలయానికి సమీపంలో ఉన్న షాహీ ఈద్గా మసీదు ఆవరణలో సర్వే చేపట్టాలని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ ఈ నెల 16న సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ కేసులో స్టే పొడిగిస్తూ సుప్రీంకోర్టు సోమవారం ఆదేశాలిచ్చింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. షాహీ ఈద్గా మసీదు ట్రస్టు కమిటీ వేసిన పిటిషన్‌ను ఏప్రిల్ తొలి వారంలో విచారణ చేపట్టనున్నట్లు కోర్టు చెప్పింది. ఈ కేసులో పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లను ఏప్రిల్‌లోనే విచారణకు స్వీకరించనున్నట్లు ధర్మాసనం తెలిపింది. కోర్టు పర్యవేక్షణలో మసీదులో సర్వే చేపట్టాలని గత ఏడాది డిసెంబర్ 14వ తేదీన అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.

మోడీని మించిన నటుడు లేడు : ప్రకాశ్ రాజ్



త్రిసూర్ : భారత రాజకీయాల్లో అత్యుత్తమ నటుడు ప్రధాని నరేంద్ర మోడీ అని ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యానించారు. ఇక్కడ ఇంటర్నేషనల్ లిటరరీ ఫెస్టివల్‌లో 'ఆర్ట్ అండ్ డెమోక్రసీ' అనే అంశంపై సోమవారం జరిగిన డిబేట్‌లో ఆయన మాట్లాడారు. 'మోడీని మించిన నటుడు భారతదేశంలో లేడు. కాబట్టి నటీనటులకు రాజకీయాల్లో అవకాశం లేదు' అని అన్నారు. 'నటన కాదు, ప్రతి ఒక్కరూ తీసుకునే వైఖరి ముఖ్యం' అని తెలిపారు. 'మనం మన శత్రువులను గుర్తించాలి. మన భయమే వారి బలమని గ్రహించాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ఈ కాలంలో ఇలాంటి విమర్శలు తప్పవు. నేను దేవుడిని నమ్మేవాడిని కాదు. నా తల్లి క్రిస్టియన్, నా భార్య హిందూ. ఎవరికి ఇష్టమైన దేవుళ్లను వారు ప్రార్థనలు చేసుకోవడానికి ఎలాంటి ఆటంకం ఉండదు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠకు ముందు ప్రధాని 11 రోజుల పాటు దేశం నుంచి గైర్హాజరయ్యారు' అని అన్నారు.

ఇజ్రాయిల్ గూఢచర్యం కేసులో నలుగురికి ఉరి

దుబాయ్ : ఇజ్రాయిల్ తో కలసి గూఢచర్యానికి పాల్పడిన కేసులో దోషులుగా తేలిన నలుగురిని ఇరాన్ సోమవారం ఉరి తీసింది. ఆ నలుగురు చేసుకున్న విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తిరస్కరించడంతో శిక్షను అమలు చేసినట్లు ఇరాన్ వార్తా సంస్థ ఇర్నా తెలియజేసింది. ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ కోసం సామాగ్రిని తయారుచేస్తున్న ఇస్ఫాన్ నగరంలోని ఫ్యాక్టరీపై బాంబు దాడి చేసేందుకు ఇరాక్‌లోని కుర్దిష్ ప్రాంతం నుండి ఇరాన్ భూభాగంలోకి ఈ నలుగురు అక్రమంగా ప్రవేశించారని మీడియా వార్తలు తెలిపాయి. ఇజ్రాయిల్ మొసాద్ తరపున 2022 వేసవి కాలంలో వీరు గూఢచర్యానికి పాల్పడి ఇరాన్ చేతికి చిక్కారు. అణు కార్యక్రమంపై ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య వివాదం దీర్ఘకాలంగా నెలకొంది. తమపై తీవ్రవాద దాడులకు ఇరాన్ పాల్పడుతోందంటూ ఇజ్రాయిల్ ఆరోపిస్తుండగా, తమ అధికారులను,, శాస్త్రవేత్తలను అనేకమందిని ఇజ్రాయిల్ హతమార్చిందని ఇరాన్ ఆరోపిస్తోంది.

కేరళలో హింసకు బిజెపి కుట్ర

- రాజకీయ ఆర్థికవేత్త పరకాల హెచ్చరిక
- మోడీ పాలనలో అంతా వినాశనమే
- వారు చెప్పేవన్నీ అబద్ధాలే
- పేదరికం, నిరుద్యోగం, రుణభారం పెరిగిపోతున్నాయి



కొచ్చి : అప్రమత్తంగా లేకుంటే ఈ రోజు మణిపూర్‌లో జరుగుతున్న హింసే దక్షిణాది రాష్ట్రమైన కేరళలోనే జరగవచ్చునని ఆర్థిక రాజకీయవేత్త పరకాల ప్రభాకర్ హెచ్చరించారు. కేరళలోని కొచ్చిలో ఎస్.రమేశన్ స్మారకోపన్యాసం ఇచ్చిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారు. పరకాల సతీమణి నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

మణిపూర్‌లో కొనసాగుతున్న మతపరమైన హింసాకాండను పరకాల ప్రస్తావిస్తూ 'దీనికి అడ్డుకట్ట వేయకపోతే ఈ రోజు మణిపూర్‌లో జరుగుతున్నదే ఎక్కడైనా జరగవచ్చు. ఎక్కడైనా, ఏదైనా జరుగుతుంది కానీ కేరళలో జరగదన్న భావనతో ఉండవద్దు' అని అన్నారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో ఒక్క ముస్లిం మంత్రి కూడా లేకపోవడం, ఎన్నికల్లో మైనారిటీలకు పార్టీ టిక్కెట్లు ఇచ్చేందుకు కాషాయ పార్టీ నిరాకరించడం వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ దేశంలో నివసిస్తున్న మైనారిటీల అవసరమే లేదని వారు స్పష్టం చేస్తున్నారని చెప్పారు.

'ఇవాళ ముస్లింలపై దాడులు జరుగుతున్నాయి. రేపు క్రైస్తవులు, ఆ తర్వాత జైనులపై జరగొచ్చు. మనం అప్రమత్తంగా లేకపోతే కేరళలోనూ అలా జరగవచ్చు' అని పరకాల హెచ్చరించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను, లౌకికతత్వాన్ని మోడీ ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. పేదరికం, నిరుద్యోగం, దేశ రుణభారం పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. '1947 నుండి 2014 వరకూ మన దేశ రుణం 50 లక్షల కోట్ల రూపాయలు. గత తొమ్మిది సంవత్సరాల్లో అది 150 లక్షల కోట్లకు పెరిగింది. నిరుద్యోగం కూడా పెరిగిపోతోంది. ఇది ఈ రోజు మనం ఎదుర్కొంటున్న సంక్షోభం. 1990 తర్వాత దేశంలోనే తొలిసారిగా 30 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి వెళ్లిపోయారు. ప్రభుత్వం మాత్రం తాను 23 కోట్ల మందికి పేదరికం నుండి విముక్తి కల్పించామని చెప్పుకుంటోంది. ప్రపంచ ఆకలి సూచీ మన దేశానికి అతి తక్కువ ర్యాంక్ ఇచ్చింది. ప్రభుత్వమేమో అది తప్పని, ఆ సూచిక ఇచ్చిన వారు భారత వ్యతిరేకులని అంటోంది. వాస్తవాలు మాట్లాడే వారందరూ ప్రభుత్వ దృష్టిలో దేశ వ్యతిరేకులే' అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

దేశంలో పేదరిక నిర్మూలనపై ప్రభుత్వ వాదన నిజమే అయితే మరో ఐదేండ్ల పాటు ఉచిత రేషన్ ఇవ్వడంలో అర్థమేముందని పరకాల ప్రశ్నించారు. 'ఇవాళ ప్రభుత్వం ఏం చెప్పినా నమ్మలేము. ఎందుకంటే అది ఇచ్చే సమాచారం విశ్వసనీయమైనది కాదు. వారు అన్నింటినీ మార్చేస్తారు. గతంలో నాలుగు లైన్ల రోడ్డులో ఒక కిలోమీటరు రోడ్డు పూర్తయితే దానిని కిలోమీటరుగా పరిగణించే వారు. కానీ ఇప్పుడు దానిని నాలుగు కిలోమీటర్లు అంటున్నారు. రోడ్లకు సంబంధించి ఎంతో చేశానని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. మీరు ఏదైనా సమాచారాన్ని అడిగితే అబద్ధాలు చెబుతారు లేదా అసలు చెప్పనే చెప్పరు' అని అన్నారు.

సరైన సమాచారం లేకపోతే ప్రజాస్వామ్యం పనిచేయదని పరకాల చెప్పారు. చర్చలు జరపడం, అసమ్మతిని వ్యక్తం చేయడం, వివరణలు ఇవ్వడం, ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించడమే ప్రజాస్వామ్యమని వివరించారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని సస్పెండ్ చేయడమో లేదా జైలులో పెట్టడమో ప్రజాస్వామ్యం కాదని చురక వేశారు. మతతత్వంపై పోరాడాలంటే లౌకికవాదానికి కట్టుబడిన వారందరూ సైనికులుగా పనిచేయాలని, అప్పుడే మనం ప్రశాంతంగా నిద్రించగలమని, లేకుంటే ఎవరూ ప్రశాంతంగా నిద్ర పోలేదని పరకాల చెప్పారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

- ఇద్దరు మృతి : పలు చర్చిల దగ్ధం



ఇంఫాల్ : జాతి ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. తాజాగా ఖమెన్‌లోక్ ప్రాంతంలో జరిగిన ఘటనలో కుకీ తెగకు చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. అనేక ఇళ్లు, చర్చిలు అగ్నికి ఆహుతి అయ్యాయి. గ్రామానికి రక్షణగా ఉన్న ఇద్దరు వ్యక్తులపై అస్సాం రైఫిల్స్‌కు చెందిన వారు కాల్పులు జరిపారని గిరిజన సంస్థ ఐటిఎల్ఎఫ్ తెలిపింది. అస్సాం రైఫిల్స్ కేంద్ర ప్రభుత్వానికి చెందిన పారామిలటరీ దళం. ఖమెన్‌లోక్ ప్రాంతం అత్యంత సమస్యాత్మకమైనది. ఇంఫాల్ లేదా సైకుల్ మీదుగా ఈ ప్రాంతానికి వెళ్లవచ్చు. గత నెలలో 'ది వైర్' పోర్టల్ ప్రతినిధులు ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు ప్రయత్నించగా కేంద్ర, రాష్ట్ర బలగాలు నిలువరించాయి.

ఖమెన్‌లోక్‌లో అనేక చర్చిలు ఉన్నాయి. అవన్నీ మంటల్లో తగలబడుతుంటే కొందరు పైశాచిక ఆనందం పొందుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. మైతీ తెగకు చెందిన అరమ్‌బాయ్ తెంగాల్ గ్రూపు ఈ ప్రాంతంలోని అనేక గ్రామాలను తగలబెట్టిందని కుకీలు తెలిపారు. ఈ గ్రూపునకు చెందిన వ్యక్తులు సైకుల్‌లోని సెనమ్ కోమ్ ప్రాంతంపై దాడి చేశారని, గ్రామ వాలంటీర్లపై కాల్పులకు తెగబడ్డారని, రెండు గంటల పాటు కాల్పులు కొనసాగాయని కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. అరమ్‌బాయ్ తెంగాల్ సభ్యులు మణిపూర్ పిసిసి అధ్యక్షుడిపై దాడి చేశారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఓ లేఖ రాశారు. కేంద్ర బలగాలు, భద్రతా దళాలు, ఇంటెలిజెన్స్ సిబ్బంది ఉన్నప్పటికీ ఈ దాడి జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి చర్య తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. సరిహద్దు పట్టణమైన మోరెహ్‌లో కుకీ తెగకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ధర్నా చేశారు. తమ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.మణిపూర్‌లో గత ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న హింసాకాండలో 300కు పైగా చర్చిలు దగ్ధమయ్యాయి. 200 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదైనప్పటికీ చాలా వాటిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

మోడీ మళ్లీ గెలిస్తే.. నియంతృత్వమే : ఖర్గే

భువనేశ్వర్ : త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఒకవేళ మోడీ ప్రభుత్వం మళ్లీ విజయం సాధిస్తే దేశంలో అవే చివరి ఎన్నికలు అని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. భువనేశ్వర్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ మళ్లీ గెలిస్తే దేశంలో ఇక నియంతృత్వమే అని అన్నారు. ప్రజలు తమ ఓటును నిర్ణయాత్మకంగా వేయడానికి ఇదే చివరి అవకాశమని, ఇకపై ఓటింగ్ సాధ్యం కాదని ఖర్గే వివరించారు. 'రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం, ఎన్నికలు పునరావృతమయ్యేలా చూసుకోవడం ప్రజల బాధ్యత. ప్రజాస్వామ్య మనుగడ ప్రజల చేతుల్లో ఉంది. మీరు ఇష్టపడితేనే ప్రజాస్వామ్యం కొనసాగుతుంది' అని ఖర్గే స్పష్టం చేశారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారని, మోడీ మాత్రం ప్రజల ప్రాణాలు తీస్తున్నాడని అన్నారు. మోడీ తన మాట వినకపోతే ఇడి, సిబిఐ, ఐటిలను ప్రయోగిస్తాడని అన్నారు. ఇండియా వేదిక నుంచి నితీష్‌కుమార్ నిష్క్రమించడంపై ఖర్గే స్పందిస్తూ 'ఒకరిద్దరు నిష్క్రమించనంత మాత్రాన వేదిక బలహీనపడదు' అని అన్నారు. బిజెపి, బిజెడిలు చాలాకాలంగా అప్రకటిత కూటమిలో ఉన్నాయని ఖర్గే చెప్పారు.

జర్మనీ ప్రాంతీయ ఎన్నికల్లో మితవాద ఎఎఫ్‌డికి ఎదురు దెబ్బ


బెర్లిన్ : తూర్పు జర్మనీలోని తురింజియాలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో మితవాద పార్టీ అయిన ఎఎఫ్‌డి (ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ) కి గట్టి ఎదురు దెబ్బ తగిలింది.కన్జర్వేటివ్ పార్టీ సిడియుకి చెందిన అభ్యర్థి హెర్గ్గాట్ చేతిలో ఎఎఫ్‌డి అభ్యర్థి చిత్తుగా ఓడిపోయారు. ఇటీవల పతాక శీర్షికలకెక్కిన 'మూకుమ్మడి తరలింపు' వార్తలతో దేశవ్యాప్తంగా మితవాద పార్టీ ఎఎఫ్‌డిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

నవంబరులో జరిగిన ఒక సమావేశంలో ఎఎఫ్‌డి రాజకీయ నేతలు సమావేశమై దేశం నుంచి విదేశీ సంతతికి చెందిన జర్మన్ పౌరులను సామూహికంగా గెంటివేయాలని పిలుపు ఇచ్చారన్న వార్తలపై జర్మనీ అంతటా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. లీప్జిగ్‌లో లక్షలాదిమందితో భారీ నిరసన ర్యాలీ జరిగింది.. మితవాద తీవ్రవాదం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరంగా పరిణమించింది. నెలకొనాలని కోరుతూ 10లక్షల మందికి పైగా ప్రజలు ఈ ర్యాలీల్లో పాల్గొన్నారు. ఆ నేపథ్యంలో తాజా ఎన్నికలు జరిగాయి.

రెండు వారాల క్రితం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎఎఫ్‌డి అభ్యర్థికి 45.7శాతం ఓట్లు రాగా, ప్రత్యర్థి హెర్గ్గాట్‌కు 33.3 శాతమే ఓట్లు వచ్చాయి. కానీ ఆదివారం జరిగిన ప్రాంతీయ ఎన్నిక ఓటింగ్‌లో హెర్గ్గాట్‌కు 52.4శాతం ఓట్లు రాగా, ఎఎఫ్‌డి అభ్యర్థి కేవలం 47.6శాతం ఓట్లే వచ్చాయి. 2014 నుండి జిల్లా స్థాయి పార్లమెంటేరియన్‌గా వున్న హెర్గ్గాట్ ఫిబ్రవరి 9న జిల్లా అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు చేపడతారు. తురింజియాలో ఎఎఫ్‌డికి బలమైన మద్దతు వుంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి తోడ్పాటు తగ్గుతోందని భావిస్తున్నారు.

బ్రిటన్‌లో అణు కుంపటి

- అమెరికా యోచన
- 15ఏళ్లలో ఇదే మొదటిసారి



లండన్: బ్రిటన్‌లో అత్యంత శక్తివంతమైన అణుయుద్ధ శీర్షికల స్థావరాన్ని ఏర్పాటు చేయాలని అమెరికా యోచిస్తున్నట్లు మీడియా తెలిపింది. బ్రిటన్‌లో అమెరికా ఇటువంటి అణ్వాయుధ స్థావరాన్ని ఏర్పాటు చేయనుండడం గత పదిహేనేళ్లలో ఇదే మొదటిసారి. ఇప్పడది మోహరిస్తున్న అణ్వాయుధాలు 1945లో హిరోషిమాపై ప్రయోగించిన అణు బాంబు కన్నా మూడు రెట్లు అధిక శక్తివంతమైనవి. ఈ అణ్వాయుధాలను సఫోక్‌లోని లాకెన్‌హీత్ ఆర్ఎఎఫ్ వద్ద భద్రపరచనున్నట్లు పెంటగాన్ పత్రాలను ఉటంకిస్తూ ది టెలిగ్రాఫ్ పత్రిక తెలియజేసింది. ఇంతకుముందు 2008లో అమెరికా అణు క్షిపణులను బ్రిటన్‌లో మోహరించింది. ఈ ఆయుధాల ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించి కాంట్రాక్టు కూడా కుదిరినట్లు ఆ పత్రాలు వెల్లడించాయి. దీనిపై బ్రిటన్ రక్షణ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ, బ్రిటన్, నాటో పాలసీలో భాగంగా చాలా కాలంగా ఇటువంటి ఏర్పాటు వుందని పేర్కొంది. అయితే, తాజా అణ్వాయుధ స్థావరం ఏర్పాటును ఖండించడం కానీ, అంగీకరించడం కానీ ,చేయలేదు. నాటో దేశాలకు, రష్యాకు మధ్య ఇప్పటికే నెలకొన్న ఘర్షణలను ఇది మరింత రెచ్చగొట్టేదిగా ఉందని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహించనున్నట్లు గత వారం నాటో ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇరాన్ నౌక హైజాక్ యత్నాన్ని తిప్పికొట్టిన భారత నేవీ

- సిబ్బందిని సురక్షితంగా విడిపించిన ఐఎన్ఎస్ సుమిత్ర



న్యూఢిల్లీ : చేపల వేటలో వున్న ఇరాన్ నౌకను హైజాక్ చేసేందుకు జరిగిన ప్రయత్నాన్ని భారత నావికాదళానికి చెందిన ఐఎన్ఎస్ సుమిత్ర విజయవంతంగా తిప్పి కొట్టింది. అడెన్ జలసంధిలో మోహరించి వున్న ఐఎన్ఎస్ సుమిత్ర సత్వరమే స్పందించి నౌకను, అందులోని సిబ్బందిని సురక్షితంగా విడిపించినట్లు నావికాదళం సోమవారం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. సోమాలియా తూర్పు తీరం పొడవునా, అడెన్ జలసంధిలో సముద్ర దొంగల చౌర్యాన్ని అడ్డుకునే కార్యకలాపాల్లో భాగంగా ఆ ప్రాంతంలోనే మోహరించిన ఐఎన్ఎస్ సుమిత్ర, ఇరాన్ పతాకంతో వున్న ఫిషింగ్ ఓడ ఇమాన్‌ను హైజాక్ చేస్తున్నారంటూ వచ్చిన ఎస్ఓఎస్ సందేశానికి సత్వరమే స్పందించింది. చేపల ఓడలోకి సముద్రపు దొంగలు ఎక్కి, అందులోని సిబ్బందిని బందీలుగా తీసుకున్నారని, వెంటనే ఆ నౌకను అడ్డుకున్న ఐఎన్ఎస్ సుమిత్ర ఇటువంటి సందర్భాల్లో అనుసరించే ఆపరేషన్ ప్రామాణికాలను అనుసరించి బోటును, అందులోని 17మంది సిబ్బందిని సురక్షితంగా కాపాడిందని ఆ ప్రకటన పేర్కొంది. ఆ తర్వాత నౌక తన ప్రయాణాన్ని సాగించిందని తెలిపింది.

2010 నుండి సముద్రపు దొంగల కార్యకలాపాలు చాలావరకు నిలిచిపోయాయి. తాజాగా ఎర్ర సముద్రంలో హౌతి రెబెల్స్ దాడులతో మళ్లీ ఈ సమస్య తలెత్తింది. డిసెంబరు, జనవరి మాసాల్లో ఇప్పటివరకు ఇలాంటి సమస్యలను పరిష్కరించిన భారత నావికాదళం సెంట్రల్, ఉత్తర అరేబియా సముద్రంలో తన నిఘాను గణనీయంగా పెంచింది. ప్రస్తుతం సముద్రపు దొంగల కార్యకలాపాలను అడ్డుకునేందుకు, అరేబియా, అడెన్ జలసంధిల్లో 12 యుద్ధ నౌకలు పనిచేస్తున్నాయి.

గాజాలో సంక్షోభం తీవ్రతరం


- నిలిచిపోయిన మానవతా సహాయం

గాజా సిటీ: గాజాలో సంక్షోభం తీవ్రతరమవుతోంది. ఇజ్రాయిల్ అణచివేత మధ్య మానవతా సహాయం కూడా నిలిపేశారు. పాలస్తీనా శరణార్థులకు సహాయం అందించే ఐక్యరాజ్యసమితి సహాయక చర్యల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) కు బ్రిటన్ నిధులను నిలిపివేసింది. అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడిలో యుఎన్‌ఆర్‌డబ్ల్యు సిబ్బంది ప్రమేయం ఉందని ఇజ్రాయెల్ ఆరోపించిన నేపథ్యంలో బ్రిటన్ ఈ చర్య తీసుకుంది. అంతకుముందు అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీ, కెనడా, ఫిన్‌లాండ్, నెదర్లాండ్స్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలు కూడా నిధులు నిలిపేశాయి. ఈ నిర్ణయం గాజాను సంక్షోభంలో పడేస్తుంది. పాలస్తీనా కోసం ప్రధాన సహాయ సంస్థకు నిధులు స్తంభింపజేయడంతో గాజాలో మానవతా సంక్షోభం మరింత తీవ్రతరమయ్యే అవకాశముంది. గాజాలోని 23 లక్షల మందిలో 20 లక్షల మంది ఈ సహాయక సంస్థపై ఆధారపడి ఉన్నారు. కమిషనర్ జనరల్ ఫిలిప్పీ లజారినీ స్పందిస్తూ, ఐరాస ఏజెన్సీకి నిధులు నిలిపేయడం దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఇది పాలస్తీనా ప్రజలను మొత్తంగా శిక్షించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ సహాయాన్ని తిరిగి ప్రారంభించాలని పిలుపునిచ్చారు..

ఐసిజె తీర్పు తరువాత
165 మంది పాలస్తీనీయులను బలిగొన్న ఇజ్రాయిల్

గాజాలో మారణహోమం ఆపడానికి అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాన్ని ఇజ్రాయెల్ ధిక్కరించింది. గడచిన 24 గంటల్లో 165 మంది ప్రాణాలు హరించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో గాజాలో మృతుల సంఖ్య 26,422కి చేరింది. ఇజ్రాయెల్ బాంబు దాడిలో ఖాన్ యూనిస్ నగరం మొత్తం ధ్వంసమైంది. ఖాన్ యూనిస్‌లోని నాజర్ హాస్పిటల్ యార్డ్‌లో 30 మంది శిశువుల మృతదేహాలను పాతిపెట్టిన దశ్యాలు బయటపడ్డాయి. అదే సమయంలో, అసోసియేటెడ్ ప్రెస్ గాజాలో కాల్పుల విరమణ కోసం జరుగుతున్న చర్చల్లో పురోగతి ఉందని అమెరికన్ అధికారులను ఉటంకిస్తూ నివేదించింది.

గ్రామీణ బంద్ పోస్టర్ల విడుదల



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న జరపతలపెట్టిన పారిశ్రామిక సమ్మెకు, గ్రామీణ బంద్‌కు మద్దతుగా పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాలు (సిటియు), రంగాల వారీ స్వతంత్ర సమాఖ్యలు, సంస్థల సంయుక్త వేదిక నేతలు హిందీ, ఇంగ్లీషు భాషల్లో పోస్టర్లను ఇక్కడ విడుదల చేశారు. కరపత్రాలు, నోటీసులు, వీడియో క్లిప్‌లతో సహా మరింత ప్రచార సామాగ్రిని త్వరలో విడుదల జేయనున్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో పంపిణీ చేసేందుకు వీలుగా వివిధ జాతీయ భాషల్లో ఈప్రచార సామాగ్రిని సిద్ధం చేస్తున్నారు. ఫిబ్రవరి 1-15 తేదీల్లో వీటిని ఇంటింటికీ తిరిగి అందజేస్తారు. తద్వారా ఈ బంద్‌కు ప్రజల నుండి పెద్ద ఎత్తున మద్దతు సంపాదించేందుకు కృషి చేస్తున్నట్లు నేతలు తెలిపారు. కార్పొరేట్ లూటీకి స్వస్తి చెప్పి, భారత రిపబ్లిక్ లౌకిక, ప్రజాతంత్ర స్వభావాన్ని కాపాడేందుకు జరుపుతున్న ఈ పోరాటంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా ఎస్‌కెఎం, సిటియులు అన్ని లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు విజ్ఞప్తి చేశాయి.

15లోగా నిర్ణయం తీసుకోండి

- మహారాష్ట్రలో అజిత్ పవార్ గ్రూపు అనర్హతపై గడువు పొడిగించిన సుప్రీం

న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని ఎన్‌సిపి రెబల్ నేత అజిత్ పవార్ గ్రూపు ఎమ్మెల్యేల అనర్హతపై ఫిబ్రవరి 15లోగా నిర్ణయం తీసుకోవాలని మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. అనర్హత పిటిషన్‌లపై ఉత్తర్వులు జారీ చేసేందుకు మరికొంత సమయం కావాలని స్పీకర్ రాహుల్ నర్వేకర్ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టును కోరారు. గడువును ఫిబ్రవరి 15 వరకు పొడిగిస్తున్నట్లు త్రిసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అనర్హత వేటుపై స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు గతంలో సుప్రీంకోర్టు జనవరి 31 వరకు గడువు విధించిన సంగతి తెలిసిందే. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అజిత్ పవార్ గ్రూపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ శరద్ పవార్ గ్రూపు నేత జయంత్ పాటిల్ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌ను కోరారు.

అమ్మా.. నాన్న.. క్షమించండి

- ఇదే నాకు చివరి ఆప్షన్
- కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం
- ఈ నెలలో ఇది రెండో ఆత్మహత్య

జైపూర్ : రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల బలవన్మరణాలు ఆగటం లేదు. తాజాగా మరో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటాలోని బోర్ఖెడ ప్రాంతానికి చెందిన నిహారికా సింగ్ (18).. జెఇఇ కోసం సన్నద్ధమవుతున్నది. జెఇఇ సాధించలేనని, పరీక్షల్లో మంచి మార్కులు పొందలేనని భావించి, తన ఇంటిలో ఉరేసుకున్నది. ఇది గమనించిన బాధితురాలి కుటుంబీకులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. నిహారికా అప్పటికే ప్రాణాలు వదిలిందని వైద్యులు ప్రకటించారు. ఆత్మహత్యకు ముందు నిహారిక సూసైడ్ నోట్‌ను సైతం రాసింది. "అమ్మా, నాన్న.. నేను జెఇఇ చేయలేను. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను. నేను ఓడిపోయాను. నన్ను క్షమించండి అమ్మా.. నాన్న. ఇదే నాకున్న చివరి ఆప్షన్" అని ఆ లేఖలో పేర్కొన్నది. ఈ ఆత్మహత్యపై దర్యాప్తు జరుపుతున్నామనీ, నిహారిక ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితుల గురించి తెలుసుకోవటానికి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. గత వారం ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన ఒక విద్యార్థి కోటలో ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కోటాలో 2023లో 27 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. 2022లో 15 మంది, 2019లో 18 మంది, 2018లో 20 మంది, 2017లో ఏడుగురు, 2016లో 17 మంది, 2015లో 18 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇక్కడ ఉన్న వివిధ శిక్షణా కేంద్రాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది విద్యార్థులు వస్తుంటారు.

లాలూని మళ్లీ ప్రశ్నించిన ఇడి

పాట్నా : ఆర్‌జెడి అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడీ) విచారించింది. ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో ఆయనను ప్రశ్నించింది. పాట్నాలో విచారణ సందర్భంగా లాలూ వెంట ఆయన కూతురు మీసా భారతి కూడా ఉన్నారు. ఈ కేసులో ఆమె కూడా నిందితురాలిగా ఉన్నారు. మహా కూటమి సంకీర్ణ సర్కారును.. నితీశ్ నేతృత్వంలోని జెడియు వీడి బిజెపితో చేతులు కలిపి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇది జరిగిన తర్వాత రోజే ఇడి లాలూ ప్రసాద్ యాదవ్‌ను విచారించటం గమనార్హం. 2004 నుంచి 2009 మధ్య యుపిఎ -1 హయాంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా పని చేసిన లాలూ ప్రసాద్ యాదవ్.. ఉద్యోగార్థుల నుంచి భూములు తీసుకొని రైల్వేలో వారికి ఉద్యోగాలు కల్పించారని దర్యాప్తు సంస్థల ఆరోపణ. ఈ కేసులో ఇడి ఢిల్లీలోని మనీలాండరింగ్ ప్రత్యేక కోర్టు ముందు చార్జిషీటును కూడా దాఖలు చేసింది. ఇందులో లాలూప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీదేవీ, ఇద్దరు కూతుర్ల పేర్లను కూడా చేర్చింది.

స్పందించిన ఆర్‌జెడి

లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఇడిని కేంద్రం ఉపయోగించుకుంటున్నదని ఆర్‌జెడి విమర్శించింది. "ఇవి ఇడి సమన్లు కాదు, బిజెపి సమన్లు. 2024 వరకు ఇలాగే ఉంటుంది. అప్పటి వరకు దయచేసి దీనిని ఇడి సమన్లు అనద్దు. మేమెందుకు భయపడాలి" అని ఆర్‌జెడి ఎంపీ మనోజ్ ఝా అన్నారు.

'బిజెపితో లేని వారికి గ్రీటింగ్ కార్డు వెళ్తుంది'

ఇడి అధికారుల తీరుపై లాలూ ఇద్దరు కూతుర్లు ఆందోళన వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థ అన్ని ప్రశ్నలకు తమ కుటుంబ సభ్యులు సమాధానాలు చెప్పారని మీసా భారతి అన్నారు. బిజెపితో ఉండనివారు, వారి వైపు (బిజెపి) వెళ్లని వారికి గ్రీటింగ్ కార్డు అందుతుందని ఇడి కార్యాలయం ముందు ఆమె అన్నారు. అనారోగ్యంతో ఉన్న తన తండ్రితో ఇడి కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. లాలూ ఆరోగ్యంగా లేరన్న విషయం దేశవ్యాప్తంగా తెలుసనీ, ఆయనకు కిడ్నీ ఆపరేషన్ జరిగిందనీ, అనేక రోగాలతో, ముఖ్యంగా వయో భారంతో ఆయన సతమతమవుతున్నారని తెలిపారు. ఇడి అధికారుల తీరు అమానవీయంగా ఉన్నదనీ, అమానుషమని లాలూ మరో కూతురు రోహిణీ ఆచార్య అన్నారు.

పిటిషనర్ ఆరోపణలన్నీ అవాస్తవం

- తమిళనాడు ప్రభుత్వాన్ని 'హిందూ వ్యతిరేకి'గా చూపే యత్నం : సుప్రీంకోర్టులో రాష్ట్ర డిజిపి


న్యూఢిల్లీ : 'అయోధ్య ఆలయం ప్రత్యక్ష ప్రసారం' కేసును తమిళనాడు ప్రభుత్వాన్ని 'హిందూ వ్యతిరేకి'గా చూపే ప్రయత్నమని ఆ రాష్ట్ర డిజిపి శంకర్ జివాల్ సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. ఈ నెల 22న అయోధ్య ఆలయం ప్రారంభోత్సవం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం, మతపరమైన కార్యక్రమాలపై నిషేధం విధిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ 'మౌఖిక' ఆదేశాలు జారీ చేశారని చెన్నై నివాసి వినోజ్ పన్నీర్‌సెల్వం తరుపున సీనియర్ న్యాయవాది దామా శేషాదిరి నాయుడు, న్యాయవాది జి. బాలాజీ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం సంక్షిప్త విచారణ నిర్వహించింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి తమిళనాడు ప్రభుత్వానికి 15 రోజుల గడువు ఇచ్చింది. ఈ కేసు ఇప్పటికే మద్రాస్ హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, పిటీషనర్ అక్కడ సంప్రదించాలని తమిళనాడు అదనపు అడ్వకేట్ జనరల్ అమిత్ ఆనంద్ తివారీ తెలిపారు. తమిళనాడు డిజిపి శంకర్ జివాల్ తన ప్రత్యేక కౌంటర్ అఫిడవిట్‌లో 'పిటీషనర్ ఆరోపణలన్నీ అవాస్తవాలు' అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయం ప్రారంభత్సోవ ప్రత్యక్ష ప్రసారం, భజనలు, అన్నదానాలు, ఊరేగింపులు, పూజలు వంటి కార్యక్రమాలు పోలీసులు, అధికారుల జోక్యం లేకుండానే జరిగాయని చెప్పారు. ఆలయం ప్రారంభోత్సవం ప్రత్యక్ష ప్రసారంపై నిషేధం విధిస్తూ స్టాలిన్ 'మౌఖిక' ఆదేశాలు జారీ చేశారనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నారు. ఆలయం ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారం, భజనలు వంటి కార్యక్రమాల కోసం మొత్తంగా 288 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ముందుగా నాలుగింటికి అనుమతి ఇచ్చామని, తరువాత మద్రాస్ హైకోర్టు ఆదేశాలతో 248 కార్యక్రమాలకు అనుమతించామని డిజిపి తెలిపారు.



మీ కోసం
బట్టలపై నూనె ఒలికితే ఉప్పు అద్దిన నిమ్మకాయ ముక్కతో రుద్దాలి.

జీవన సౌరభం
ప్రశ్నించనిదే సమాధానం దొరకదు. ప్రయత్నించనిదే విజయమూ దక్కదు.

ఉత్తమ విద్యార్థి



ఒక గురుకులంలో కొంతమంది విద్యార్థులు ఉన్నారు. వారు గురువు చెప్పిన పాఠాలను ఎంతో శ్రద్ధగా వినేవారు. విద్యాభ్యాసం పూర్తయ్యేసరికి ఉత్తమ విద్యార్థిని ప్రకటించడం ఆ గురుకులం ఆనవాయితీ. అయితే శిష్యులందరిలో ఓ ఇద్దరు చదువులో ఎప్పుడూ చురుకుగా ఉండేవారు. వారిద్దరి తెలివితేటలు అమోఘం.

ఆ ఏడాది గురువు గారు ఆ ఇద్దరిలో ఎవర్ని ఉత్తమ విద్యార్థిగా ప్రకటిస్తారో అని అందరూ ఎదురుచూడసాగారు. ఒకరోజు గురువు వాళ్ళిద్దరినీ పిలిచి కొంత సొమ్ము ఇచ్చాడు.

"నేను మీకు ఇస్తున్నది చాలా చిన్న మొత్తం. దీనితో మీరు ఏదైనా కొని ఒక గదిని నింపాలి" అనిఅన్నారు.

మొదటి శిష్యుడు బాగా ఆలోచించి, బోల్డంత ఎండుగడ్డిని కొని గదిని నింపాడు. గురువును చూడమని ఆహ్వానించాడు. గురువు అది చూసి 'చాలా నిరుత్సాహంగా ఉంది. నేను చేయమన్నది, ఇది కాదు' అని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రెండో శిష్యుడు ఒక చిన్న కాసును ఖర్చు చేసి ఒక దీపం కొన్నాడు. దాన్ని వెలిగించగానే గదంతా కాంతితో నిండిపోయింది. అది చూసిన గురువు ఆ శిష్యున్ని ఎంతో మెచ్చుకుని, "నలుగురికీ వెలుతురు ఇద్దామను కునే వాడే నిజమైన వివేకవంతుడ"ని అభినందిస్తూ అతడినే ఉత్తమ విద్యార్థిగా ప్రకటించారు.



– ఇన్యారం వైష్ణవి, 9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందిరా నగర్, సిద్ధిపేట జిల్లా.

తేడాలు గుర్తించండి



పిల్లలూ, ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో 8 తేడాలున్నాయి. గుర్తించండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ





డి.ఉమ, 4వ తరగతి, దిగువ సాంబయ్య పాళెం, తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లలకు ఇలా నేర్పిద్దాం!



పిల్లలు జీవితంలో సరైన మార్గంలో వెళ్లాలని ప్రతి తల్లీదండ్రీ కోరుకుంటారు. ఎదుగుతున్న పిల్లలకు కొంతమంది తల్లిదండ్రులు అతి స్వేచ్ఛను ఇస్తే– మరికొందరు తాము చెప్పినట్లే చేయాలని పిల్లల మీద ఒత్తిడి తెస్తుంటారు. ఈ రెండు పద్ధతులు పిల్లలపై విపరీత ప్రభావాన్ని చూపుతాయి. బాగా గారాబం చేయడం లేదా కఠినంగా ప్రవర్తించడం చాలామంది తల్లిదండ్రుల్లో కనిపించే సాధారణ స్వభావం. ఇది పిల్లల ఆలోచనా సరళిలో ఎన్నో వైరుధ్యాలకు దారితీస్తుంది.

సానుకూల దృక్పథం : పిల్లల చుట్టూ ఉన్న సమాజాన్ని ఒక్కొక్కటిగా వారికి పరిచయం చేయాలి. పిల్లలకు వచ్చే సందేహాలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పాలి. ప్రతి ఒక్క అంశాన్ని సానుకూల దృక్పథంతో ఆలోచించేలా చేయాలి. చదువులో గాని, ఆటల్లో గాని వారికి కావాల్సిన ప్రోత్సాహం అందించాలి. తద్వారా వారిలో ఏదైనా సాధించగలం అనే దృక్పథం పెరుగుతుంది.

సహాయపడే గుణం

పిల్లలకు చిన్నప్పటి నుండి సహాయపడే గుణాన్ని అలవాటు చేయాలి. ఇతరులకు సహాయపడే కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయాలి. ఏదైనా సాధించాలనే తపనతో పాటు ఇతరులకు సహాయపడాలనే ఆలోచన ఉండడం వల్ల పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి.

కోపగించుకోవద్దు : కొన్ని సందర్భాల్లో పిల్లలపై తెలియకుండానే కోప్పడుతుంటారు. అలాంటి సందర్భాలలో కొంచెం నిగ్రహంగా ఉండాలి. గట్టిగా అరవడం, తిట్టడం వంటివి చేయకుండా, దగ్గరకు తీసుకొని అలా చేయకూడదని నెమ్మదిగా చెప్పాలి. ఆ పని వల్ల జరిగే అనర్థాలు ఏమిటో వివరించాలి. ఎంత ఎక్కువ కోపం ప్రదర్శిస్తే పిల్లలు అంత మొండిగా తయారవుతారు.

బాధ్యతల అప్పగింత

పిల్లలకు ఇంటి పనుల్లో కూడా భాగస్వామ్యం కల్పించాలి. ఇంట్లో చిన్న చిన్న బాధ్యతలను అప్పజెప్పాలి. దానివల్ల ఎలా నడుచుకోవాలో వారికి చిన్నప్పటి నుంచీ తెలుస్తుంది.

సఖ్యతతో మెలగండి

అమ్మానాన్న సఖ్యతగా ఉండడం అనేది కూడా పిల్లల ఎదుగుదలకు దోహదపడుతుంది. చాలామంది పిల్లలు అమ్మతోనో లేదా నాన్నతో మాత్రమే చనువుగా ఉంటారు. ఇంకొకరితో పెద్దగా మాట్లాడరు. ఇద్దరితో సమానంగా తమ అభిప్రాయాలను పంచుకునే వాతావరణం కల్పించాలి.

సవాళ్లను ఎదుర్కొనేలా ..

ఏదైనా సాధించాలనే లక్షణాన్ని చిన్నప్పటి నుంచీ అలవర్చాలి. ఎటువంటి సవాళ్లనైనా ధైర్యంగా స్వీకరించేలా ప్రోత్సహించాలి. ఏ పనినైనా ఇష్టంగా చేయడం నేర్పాలి. ఇలా చేయడం వల్ల వారిలో సానుకూల స్థితిలో పోరాట పటిమ పెరుగుతుంది. ఏదైనా సాధించాలనే తపనా అలవడుతుంది.

ఒత్తిడి నియంత్రణ

దైనందిన జీవితంలో ఎన్నో ఒత్తిళ్లతో సతమతమవుతుంటాం. అవన్నీ పిల్లలపై చూపించకూడదు. విసుక్కోవడం, చీదరించుకోవడం, అరవడం వంటివి చేస్తే పిల్లల్లో తల్లిదండ్రుల పట్ల వ్యతిరేక భావం పెరుగుతుంది. కాబట్టి పెద్దలు తమ ఒత్తిడిని, కోపాన్ని పిల్లల మీద చూపించకూడదు.

కుష్ఠు నిర్మూలన కోసం ...



దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ కుష్ఠు వ్యాధి నిర్మూలన పూర్తిగా సాధ్యం కావటం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ఏటా జనవరి 30న ప్రపంచ కుష్ఠు వ్యాధి అవగాహనా దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. ఆ మేరకు అనేక దేశాల్లో ఈ రోజున కుష్ఠు వ్యాధి నిర్మూనలకు అవగాహనా కార్యక్రమాలు జరుగుతాయి.

వాతావరణంలో సామాన్యంగా కన్పించే మైకో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వస్తుంది. రోగనిరోధక వ్యవస్థలో మార్పులు, వాపు కూడా తీవ్రతను పెంచుతాయి. వ్యాధి సోకిన వ్యక్తికి దీర్ఘకాలం దగ్గరగా ఉండటం, ఆ బ్యాక్టీరియాతో కలుషితమైన గాలిని పీల్చుకోవటం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చర్మం, శ్వాసకోశ వ్యవస్థ, కళ్లు, నరాలు బాగా ప్రభావానికి గురౌతాయి. మెదడు, వెన్నుపాము వెలుపల ఉన్న నరాలు కూడా ప్రభావితం అవుతాయి. ఈ రోగులతో కలిసి భోజనం చేయటం, వారితోపాటు కూర్చోవటం ద్వారా వ్యాధి సోకదు.

వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవటం ద్వారా ఈ వ్యాధిని సులభంగా తగ్గించుకోవచ్చు. కౌగిలింత, కరచాలనం, లైంగిక సంపర్కాల ద్వారా ఈ వ్యాధి రాదు. గర్భిణికి ఈ వ్యాధి వస్తే పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి రాకుండా చేయటానికి చికిత్స అందుబాటులో ఉంది. ఈ వ్యాధి వచ్చిన వారికి పాదాలు, వేళ్లు పనిచేయవనే అపోహ ఉంటుంది. అదేమీ నిజం కాదు. బ్యాక్టీరియాతో చేతివేళ్లు, కాలివేళ్లుగా తిమ్మిరిగా ఉంటాయి. చికిత్స తీసుకుంటే త్వరగానే నయమవుతాయి.

లక్షణాలు ఎలాగుంటాయంటే..

- చర్మంపై కందిన, రంగు మారినట్లుగా మచ్చలు
- తేలికపాటి తిమ్మిరులు
- క్షీణించిన, వాడిపోయిన గాయాలు
- చర్మంపై బొడిపెలు
- పొడిబారిన, గడ్డిబడిన చర్మం
- చర్మంపై బొడిపెలు • అరికాళ్లలో పుండ్లు
- ముఖం లేదా చెవులపై గడ్డలు
- కనురెప్ప వెంట్రుకలు, కనుబొమ్మలు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతింటాయి.
- కండరాల్లో బలహీనత •చెమట పట్టకపోవటం
- ప్రభావిత ప్రాంతంలో పక్షవాతం
- ఆఖరి దశల్లో చేతికాలి వేళ్లు చిన్నగా మారతాయి.
- పాదంపై పుండ్లు మానకుండా ఉంటాయి.

చికిత్సా పద్ధతులు

కుష్టుని పాసిబాలసిల్లరీ లెప్రసీ (నెగిటివ్ స్మియర్లు), మల్టిబాసిల్లరీ లెప్రసీ (పాజిటివ్ స్మియర్లు)గా వర్గీకరిస్తారు. లెప్రసీ సమస్య పైకి కన్పించే లక్షణాలు కలిగివుంటుంది. చికిత్సల్లో డాప్సోన్, క్లోఫాజైమిన్, రిఫాంపసిన్ పద్ధతులు ఉంటాయి. తిమ్మిరిని ఎదుర్కోవటానికి, పాదాలను రక్షించే, ప్రత్యేక బూట్లను వాడాలి. ఏడాది కాలంలోనే చికిత్సల ద్వారా వ్యాధిని నయం చేయొచ్చు.



– డాక్టర్ పిఎస్ శర్మ, మెడికల్ ఆఫీసర్, బ్లడ్ సెంటర్, కిమ్స్, అమలాపురం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

ఉత్తమ నటుడు రణబీర్.. చిత్రం 12th ఫెయిల్

బాలీవుడ్ ప్రతిష్టాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ అవార్డులను ప్రకటించారు. 69వ 'ఫిల్మ్‌ఫేర్' అవార్డుల వేడుక గుజరాత్‌లోని గాంధీనగర్ వేదికగా శని, ఆదివారాల్లో జరిగింది. 2023 విడుదలైన చిత్రాలకుగాను ఈ అవార్డులను ప్రకటించారు. గతేడాది అక్టోబర్‌లో విడుదలై సంచలనం సృష్టించిన 12 ్త ఫెయిల్ చిత్రం ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈ చిత్రం ముంబయి అడిషనల్ కమిషనర్ అయిన మనోజ్‌కుమార్ శర్మ బయోపిక్. ఈ చిత్రాన్ని బాలీవుడ్ దర్శకుడు విధు వినోద్ చోప్రా తెరకెక్కించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సొంతం చేసుకోవడమే కాకుండా.. అవార్డులు కూడా వరించాయి. ఉత్తమ చిత్రంతోపాటు, దర్శకుడు వినోద్‌చోప్రాకు ఉత్తమ దర్శకుడు అవార్డు కూడా వరించింది. బాలీవుడ్ నటుడు రణబీర్ కపూర్‌కి 'యానిమల్' చిత్రంలో నటనకుగాను ఉత్తమ నటుడు అవార్డు లభించింది.





అవార్డుల జాబితా

ఉత్తమ చిత్రం: 12 th ఫెయిల్
ఉత్తమ చిత్రం (క్రిటిక్స్): జొరామ్
ఉత్తమ దర్శకుడు: విధు వినోద్ చోప్రా (12 th ఫెయిల్)
ఉత్తమ నటుడు: రణ్‌బీర్ కపూర్ (యానిమల్)
ఉత్తమ నటుడు (క్రిటిక్స్): విక్రాంత్ మెస్సె (12th ఫెయిల్)
ఉత్తమ నటి: అలియా భట్ (రాఖీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ)
ఉత్తమ నటి (క్రిటిక్స్): రాణీ ముఖర్జీ (మిస్సెస్ ఛటర్జీ ఎం నార్వే), షఫాలీ షా (త్రీ ఆఫ్ అజ్)
ఉత్తమ సహాయ నటుడు: విక్కీ కౌశల్ (డంకీ)
ఉత్తమ సహాయ నటి: షబానా అజ్మీ (రాఖీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ)
ఉత్తమ గీత రచయిత: అమితాబ్ భట్టాచార్య(తెరె వాస్తే..: జరా హత్కే జరా బచ్కే)
ఉత్తమ మ్యూజిక్ ఆల్బం: యానిమల్
ఉత్తమ నేపథ్య గాయకుడు: భూపిందర్ బాబల్ (అర్జన్ వెయిలీ- యానిమల్)
ఉత్తమ నేపథ్య గాయకురాలు: శిల్పా రావు (చెలెయ- జవాన్)
ఉత్తమ కథ: అమిత్ రాయ్ (ఒఎంజి2)
ఉత్తమ స్క్రీన్‌ప్లే: విధు వినోద్ చోప్రా (12 th ఫెయిల్)



అవార్డు ఫంక్షన్‌లో రణబీర్

ఉత్తమ డైలాగ్: ఇషితా మొయిత్రా (రాఖీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ)

సందడి చేసిన రణబీర్, ఆలియాభట్

బాలీవుడ్ కపుల్స్ రణబీర్‌కపూర్, ఆలియాభట్ డ్యాన్స్‌తో అలరించారు. అవార్డుల వేదికపై వీరిద్దరూ ఉత్తమ హీరో, హీరోయిన్లుగా పురస్కారాలు అందుకున్న విషయం తెలిసిందే. రణబీర్ తాజాగా నటించిన యానిమల్ చిత్రంలోని 'జమల్‌కుదు' హుక్ స్టెప్ వేస్తూ స్టేజ్ ముందున్న తన భార్య దగ్గరకు వచ్చాడు. అక్కడ కూడా తలపై గ్లాసు పెట్టుకుని స్టెప్పులు వేశారు. ఇద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. .



'డంకీ' చిత్రంలో విక్కీ కౌశల్



'మిస్సెస్ ఛటర్జీ ఫ్రమ్ నార్వే' చిత్రంలో రాణీ ముఖర్జీ

కుర్రాళ్లకు అసలు పరీక్ష

- **నేడు సూపర్-6లో న్యూజిలాండ్‌తో ఢీ**
- **ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్**



జొహన్నెస్‌బర్గ్: ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో దుర్భేధ్యఫామ్‌లో ఉన్న భారత యువ క్రికెటర్లకు అసలు పరీక్ష మంగళవారం ఎదురు కానుంది. గ్రూప్ దశలో ఓటమి ఎరుగని ఉదయ్ సహారన్ సారథ్యంలోని భారతజట్టు మంగళవారం నుంచి ప్రారంభం కానున్న సూపర్-6 తొలి మ్యాచ్‌లోనూ కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. గ్రూప్-ఎలో భారతజట్టు తొలి లీగ్ మ్యాచ్‌లోనే పటిష్ట బంగ్లాదేశ్‌ను చిత్తుచేయగా.. ఆ తర్వాత ఐర్లాండ్, అమెరికాలపై సునాయాసంగ విజయాలను నమోదు చేసింది. గ్రూప్ దశలో భాగంగా భారతజట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 84పరుగుల తేడాతో గెలుపొందగా.. రెండో లీగ్‌లో ఐర్లాండ్, అమెరికాలపై 201పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో గ్రూప్-ఎలో వరుసగా మూడు విజయాలతో టాపర్‌గా నిలిచింది. మరోవైపు గ్రూప్-డిలో న్యూజిలాండ్ జట్టు 2మ్యాచుల్లో గెలిచి పాక్ చేతిలో ఓటమితో రెండో స్థానంలో నిలిచింది. ప్రతి గ్రూప్‌లో టాప్-లో ఉన్న జట్లు నేరుగా సూపర్-6 పోటీల్లో ఆడనున్నాయి. ఫిబ్రవరి 2న నేపాల్‌తో చివరి సూపర్-6 మ్యాచ్ ఆడనుంది. ఇక సూపర్-6లో ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. సెమీస్ ఫిబ్రవరి 6, 8న, ఫైనల్ 11న జరగనుంది.

నేడు జరిగే సూపర్-6 మ్యాచ్‌లు..
శ్రీలంక(అండర్-19) × వెస్టిండీస్(అండర్-19)
పాకిస్తాన్(అండర్-19) × ఐర్లాండ్(అండర్-19)
ఇండియా(అండర్-19) ×న్యూజిలాండ్(అండర్-19)
(గమనిక: మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 1.30గంIIలకు ప్రారంభం కానున్నాయి)

టీమిండియాకు ఎదురుదెబ్బ

రెండోటెస్ట్‌కు కెఎల్ రాహుల్, జడేజా దూరం






ముంబయి: తొలి టెస్ట్‌లో ఓడిన షాక్‌లో ఉన్న టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. విశాఖ వేదికగా ఫిబ్రవరి 2నుంచి ఇంగ్లండ్‌తో జరిగే రెండోటెస్ట్‌కు కెఎల్ రాహుల్‌తోపాటు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా దూరమయ్యారు. వీరిద్దరూ గాయాల బారినపడి విశాఖ టెస్ట్‌లో ఆడడం లేదని బిసిసిఐ సోమవారం వెల్లడించింది. వీరి స్థానాల్లో ముగ్గురిని ఎంపిక చేసినట్లు ప్రకటించింది. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న సర్ఫరాజ్ ఖాన్‌తోపాటు వాషింగ్టన్ సుందర్, సౌరభ్ కుమార్‌ను ఎంపిక చేసింది. తొలి టెస్టులో జడేజా రన్నింగ్ చేస్తుండగా మడమ కండరం పట్టేయగా.. కెఎల్ రాహుల్‌కు తొడ కండరం నొప్పి రావడంతో విశ్రాంతి కావాలని కోరినట్లు వీరిని వైద్యబృందం నిరంతరం ఇద్దరినీ పరిశీలిస్తున్నట్లు బిసిసిఐ ఆ ప్రకటనలో తెలిపింది.

బుమ్రాకు ఒక డీ మెరిట్ పాయింట్

ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఓలీ పోప్ పరుగుతీస్తుండగా.. భారత పేసర్ బుమ్రా ఉద్దేశపూర్వకంగా తగిలినట్లు ఐసిసి రిఫరీ నిర్ధరించారు. దీంతో ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఆర్టికల్ 2.12 ప్రకారం బుమ్రా శిక్షార్హుడిగా ఐసిసి గుర్తించింది. గత 24 నెలల్లో బుమ్రా చేసిన తొలి నేరం కాబట్టి.. అతడి రికార్డులకు ఒక డీ మెరిట్ పాయింట్‌ను విధించింది. ఫీల్డ్ అంపైర్లు పాల్ రీఫిల్, క్రిస్ గఫానీ, థర్డ్ అంపైర్ మారియస్ ఎరాస్మస్, ఫోర్త్ అంపైర్ రోహన్ పండిత్ నిర్ణయం మేరకు మ్యాచ్ రిఫరీ శిక్షను ఖరారు చేశారు. తను చేసిన నేరాన్ని బుమ్రా అంగీకరించడంతో తదుపరి విచారణ అవసరం లేదని ఐసిసి స్పష్టంచేసింది.

రెండోటెస్ట్‌కు బిసిసిఐ ప్రకటించిన జట్టు: రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్, జైస్వాల్, శ్రేయస్, శ్రీకర్ భరత్, ధృవ్ జోరెల్(వికెట్ కీపర్లు), అశ్విన్, అక్షర్ పటేల్, కుల్దీప్, సిరాజ్, ముఖేశ్, బుమ్రా(వైస్ కెప్టెన్), ఆవేశ్ ఖాన్, రజత్ పటీధర్, సర్ఫరాజ్ ఖాన్, సుందర్, సౌరభ్ కుమార్.

ఏప్రిల్‌లో 'మ్యాజిక్' సినిమా విడుదల



గౌతమ్ తిన్ననూరి, అనిరుధ్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న చిత్రం మ్యాజిక్. గతేడాది కొత్తవారిని సినీరంగానికి పరిచయంచేస్తూ 'మ్యాడ్' సినిమాను తీసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరో నలుగురు కొత్తతరం వారిని ప్రధాన పాత్రల్లో పరిచయం చేస్తూ 'మ్యాజిక్' సినిమాను నిర్మించబోతున్నారు. సెన్సిబుల్ టీనేజ్ డ్రామాతో ఈ సినిమా సిద్ధమవుతోంది. కాలేజ్ ఫెస్ట్ కోసం ఒక ఒరిజినల్ సాంగ్‌ను కంపోజింగ్ చేయటానికి నలుగురు టీనేజర్లు చేసే ప్రయత్నం చుట్టూ కథ తిరుగుతుంది. గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీ అందించారు. ప్రొడక్షన్ బాధ్యతలను అవినాష్ కొల్లా చూస్తున్నారు. ఎడిటర్‌గా నవీన్ నూలి, కాస్ట్యూమ్ డిజైనర్‌గా నీరజ కోన వ్యవహరించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందించారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఏప్రిల్‌లో ఈ సినిమా విడుల చేస్తామని చిత్ర నిర్మాతలు ఇటీవల ప్రకటించారు.

ఆంధ్ర గెలుపు

ఛత్తీస్‌గఢ్‌తో రంజీట్రోఫీ

రాయ్‌పూర్: ఛత్తీస్‌గడ్‌తో జరిగిన రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించింది. 320పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఛత్తీస్‌గడ్ జట్టు ఆంధ్ర బౌలర్లు 193పరుగులకు ఆలౌట్ చేశారు. దీంతో ఆంధ్ర జట్టు 126పరుగుల తేడాతో విజయం సాధించింది. వికెట్ నష్టపోకుండా 20పరుగులతో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఛత్తీస్‌గడ్‌ను ఆంధ్ర బౌలర్ ప్రశాంత్ కుమార్(3/21), నితీశ్ కుమార్(3/36) కట్టడి చేశారు. ఛత్తీస్‌గడ్ జట్టులో ఎక్నాథ్ కెర్కర్(76), అమన్దీప్ ఖరే(67) అర్ధసెంచరీలతో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హనుమ విహారికి లభించింది. ఈ గెలుపులో ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రజట్టు 4మ్యాచుల్లో 2 విజయాలు, ఒక ఓటమితో 15పాయింట్లతో రెండోస్థానంలో కొనసాగుతోంది.

పాకిస్తాన్‌కు బయల్దేరనున్న భారత డేవిస్‌కప్ జట్టు

న్యూఢిల్లీ: భారత డేవిస్ కప్ జట్టుకు పాకిస్తాన్ వీసా మంజూరైంది. ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషనర్ కార్యాలయం రోహిత్ రాజ్‌పాల్ బృందానికి వీసాలు జారీ చేసింది. దాంతో, దాదాపు 60ఏళ్ల తర్వాత డేవిస్‌కప్ ఆటగాళ్లు పాకిస్తాన్‌గడ్డపై కాలుమోపనున్నారు. ఫిబ్రవరిలో డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ 1 ప్లే ఆఫ్స్ ఆడేందుకు భారత బృందం పాకిస్తాన్‌కు పయనం కానుంది. ఇస్లామాబాద్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య ఫిబ్రవరి 3, 4వ తేదీల్లో డేవిస్ కప్ టై మ్యాచ్ జరుగనుంది. **జట్టు: రోహిత్ రాజ్‌పాల్(కెప్టెన్), యుకీ బ్రాంబీ, రామ్‌కుమార్ రామనాథన్, ఎన్.శ్రీరాం బాలాజీ, సాకేత్ మైనేని, నికీ కలియందా పూనచ, దిగ్విజయ్ ఎస్వీ ప్రజ్వల్ దేవ్(రిజర్వ్).**

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68